ప్రజాశక్తి

Vol. 5, no. 12

(Sept. 20, 1944)

బెజవాడ, 1944

Record no. 683

Prajāśakti

Vol. 5, no. 12

(Sept. 20, 1944)

Bejavāḍa, 1944

Record no. 683



చరిత్రాత్మక సమావేశం

★

ఎట్టకేలకు, భారతభాగ్యవిధాతలు, గాంధీ-జిన్నా లిద్దరూ, బొంబాయిలో సంప్రతింపులు సాగిస్తున్నారు.

రెండు సంవత్సరాల క్రితం యిట్టి సంప్రతింపులకోసరమే గాంధీజీ ఉవ్విళ్లూరాడు. కాని, అధికారవర్గం అరెస్టుచేయించింది. ఇప్పుడో, సంప్రతింపులు జరక్కుండా ఎవరూ వీరిని అడ్డుపెట్టలేరు.

కనుకనే, చూడండి: వేవెల్‌ప్రభువు ఎలా వెలవెలబోతున్నాడో, చర్చిల్ - అమెరీలు ఎలా గజగజలాడుతున్నారో, ఇక వైస్రాయి కార్యనిర్వాహకవర్గసభ్యులమాట అడిగారూ? పాపం, వారిగోల వినే నాధుడే లేడు.

గాంధీ - జిన్నా సంప్రతింపులు ఫలిస్తే, తమ ఆటలిక సాగవని యీ ముఠాకు బాగా తెలుసు. ప్రధానమైన యీ రెండు రాజకీయ సంస్థలూ రాజీకి వచ్చినట్లైతే, ఆ సేతు హిమాచల పర్యంతం 40 కోట్లమంది భారతీయులు ఐక్యకంఠంతో జాతీయవాంఛను ప్రకటిస్తారు. దేశరక్షణకై జాతీయప్రభుత్వం అవసరమని ఎలుగెత్తి చాటుతారు. బ్రిటన్‌లో ప్రజాస్వామ్యశక్తులు విజృంభిస్తాయి. "అనైక్యత" అనే సాకుతో తనప్రజల్ని బ్రిటిష్‌ప్రభుత్వం మోసగించలేదు. అటు ఫిలిప్స్ నివేదిక అమెరికన్ ప్రజల చేతుల్లో ఒకబలమైన ఆయుధంగా తయారైంది. భారతదేశ వ్యవహారాల్లో అమెరికా ప్రభుత్వం జోక్యం కలిగించుకు తీరాలనే అభిప్రాయం నానాటికీ అమెరికాలో బలపడుతూంది.

ఈ దృశ్యంచూచి, సామ్రాజ్యవాదుల గుండెల్లో రైళ్లు పరుగెత్తుతున్నాయంటే నమ్మండి.

డాక్టరు మూంజీ అసలురంగు

సామ్రాజ్యవాదుల యీ గుండెదడతో బాటు, హిందూమహాసభ యొక్క అసలు రంగుకూడా బయటపడుతోంది. ఇన్నాళ్లూ "అఖండ హిందూస్థాన్" పేరుతో కాంగ్రెసు నినాదాలు జపిస్తూ, కాంగ్రెసు వాదుల్ని బుట్టలో వేసుకోడానికి ప్రయత్నిస్తూన్న యీ సంకుచిత మతాభిమానులు బ్రిటిష్ నిరంకుశాధికార వర్గానికి యెలా సాయపడుతున్నారో ప్రపంచానికి నేడు స్పష్టంగా తెలిసిపోతూంది.

ఉదాహరణకు, డాక్టరు మూంజీని చూడండి: యు. పి. హిందూ విద్యార్థుల సభలో ఉపన్యసిస్తూ ఈయన, గాంధీ-జిన్నా సంప్రతింపులు ఫలించినప్పటికీ హిందూ-ముస్లిం ఐక్యత సిద్ధించదన్నాడు. జాతీయ ప్రభుత్వంగాని, సంపూర్ణ స్వాతంత్ర్యంగాని, లభించదట! శాశ్వతమైన విషబీజాలు మన ప్రజల్లో నాటబడుతాయట! ఇంతేకాదు, నేటి రాజకీయ ప్రతిష్టంభనకు కారణం పూర్తిగా, గాంధీగారేనంటున్నాడు. ప్రపంచంలో రాజ్యాంగాలూ, ప్రభుత్వాలూ

(తరువాయి 2 వ పేజీ)

మా ఆశయం

★

గాంధీజీతో జిన్నా యిలా అన్నారు:

" మనం ఒడంబడిక చేసికోకుండా ఎవరిదారిని వారు విడిపోతే, ప్రపంచం యెదుట మన చేతగానితనాన్ని వెల్లడించుకొన్నవారమవుతాం."

★

ప్రార్థనసమయంలో గాంధీజీ యిలా చెప్పారు:

"సంప్రతింపులు విఫలమైతే, కోట్లకొలది భారతప్రజలకు ఆశాభంగం కలుగుతుంది. ప్రపంచ పీడితప్రజలు నేడు మావైపే ఆశతో ఊపిరి బిగబట్టుకొని నిరీక్షించుతున్నారు. మా బాధ్యత లేమో మేమిద్దరం పూర్తిగా గ్రహించాం. భారతదేశానికంతకూ సంపూర్ణ స్వాతంత్ర్య స్థాపనే మా ఉభయుల గమ్యస్థానం. అందుకే మేం ప్రార్థిస్తున్నాం. అందుకే మా జీవితా లర్పించడానికి శపథం చేస్తున్నాం."

(11-9-44)

ప్రతిష్టంభనా పరిష్కారానికి — " డాన్ "(ముస్లింలీగ్ దినపత్రిక) నుండి



గాంధీ-జిన్నాలిద్దరూ ప్రతిష్టంభన అనే తాళాన్ని బద్దలుకొడుతున్నారు. వైస్రాయి వేవెల్ తాళంచెవిని దాచుకున్నా లాభంలేదని, బుఱ్ఱ గోక్కుంటున్నాడు.

★

ప్రజాశక్తి
భారత కమ్యూనిస్టుపార్టీ, ఆంధ్రకమిటీ పత్రిక
సంపుటి 5 బుధవారం 20—9—44 సంచిక 12

కస్తూరిబా స్మారకనిధి

ఇప్పటికి కస్తూరిబా స్మారకనిధి 70 లక్షల రూపాయలు దాటిందని కార్యదర్శి ఠక్కరుగారు ప్రకటించారు. 75 లక్షల రూపాయలు వసూలుచేసి, అక్టోబరు 2 వ తేదీనాడు అనగా గాంధీజీ 75 వ జన్మదినోత్సవంనాడు మహాత్మునికి యీ నిధిని పూజాపుష్పంగా అర్పించదలచారు. వసూలైన సొమ్ములో ముప్పాతికపాళ్లు ఆ యా ప్రాంతాలలోనే ఖర్చు పెట్టించుతారు. గ్రామాలలో ప్రసవసౌకర్యాలు, ఆడవాళ్లకు - పిల్లలకు వైద్యశాలలు, అనాథబాలికా శరణాలయాలు వగైరా నిర్మించాలని ధర్మకర్తలసంఘం నిర్ణయించింది. మిగిలిన సొమ్ముతో మరేదైనా పెద్దసంస్థల్ని స్థాపించుతారు. ఇంకెంతో వ్యవధిలేదు. ప్రజాసేవకులు, దేశభక్తులు అందరూ పూనుకొని నిధిని పూర్తిచేయడానికి కృషిచేయాలి. ఈ నెలాఖరుకు అనుకున్న 75 లక్షలను మించునట్లుచేసి కస్తూరిబాకు, మహాత్మునికి భారతప్రజలు కృతజ్ఞతాంజలిని అందచేయాలి.

ప్రజాశక్తి

బుధవారం 20-9-44

సర్దారుకు మా జోహారులు

తంజావూరు జైలులో డిటిన్యూగావున్న సర్దార్ దండు నారాయణరాజుగారు యీనెల 9వ తేదీన హృదయచలనం ఆగిపోయి, ఆకస్మికంగా మరణించారు. ఈవిషాదవార్త ప్రజాసేవకులందరి హృదయాలను కలచివేసింది. రాజుగారి మరణంవల్ల నిజంగా తెనుగుతల్లి ఒక వీరపుత్రుని గోల్పోయింది. భారత స్వాతంత్ర్యోద్యమం సుశిక్షితుడైన ఒకయోధుని నష్టపోయింది. పశ్చిమగోదావరిజిల్లా ప్రజలు తమ నాయకుని పోగొట్టుకున్నారు.

నారాయణరాజుగారు 1889లో జన్మించారు. బి. ఏ. బి.ఎల్. ప్యాసయి ప్లీడరీవృత్తిలో వుండగా, 1920లో గాంధిమహాత్ముని సహాయనిరాకరణోద్యమ శంఖారావం వినిపించింది. వెంటనే రాజుగారు ప్లీడరీవృత్తికి స్వస్తి చెప్పారు. భారత స్వాతంత్ర్యోద్యమంలో సైనికునిగా చేరారు. నాటినుంచి నేటివరకు వచ్చిన అన్ని ప్రజా ఉద్యమాలలోనూ రాజుగారు పాల్గొన్నారు. అనేక సంవత్సరాలు జిల్లాకాంగ్రెసు అధ్యక్షులుగా పనిచేశారు. కాంగ్రెసుపక్షాన మద్రాసు శాసనసభకు పశ్చిమగోదావరి జిల్లాప్రజల ప్రతినిధిగా ఎన్నుకోబడ్డారు. జిల్లాబోర్డు అధ్యక్షులుగా (1936-38 సంవత్సరాలమధ్య) పనిచేశారు. ఇంతేగాక, అనేక సంవత్సరాలు జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్‌బ్యాంకుకు అధ్యక్షులుగా పనిచేశారు.

సర్దారుగారు 1926-31 సంవత్సరాలమధ్య కృష్ణా-గోదావరీ మండలాల రీసెటిల్మెంటు అవసపుపన్నులకు వ్యతిరేకంగా రైతుఉద్యమాన్ని నడిపారు. తరువాత 1930 ఉప్పుసత్యాగ్రహంలోనూ, 1933 శాసనోల్లంఘనోద్యమంలోనూ పాల్గొన్నారు. ప్రభుత్వంచే శిక్షింపబడి అనేకసార్లు జైలు యాత్రచేశారు. 1940 వ్యష్టి సత్యాగ్రహంలో జైలుకెళ్లారు. 1942లో ప్రభుత్వం రాజుగారిని డిటెయిన్ చేసింది. అప్పటినుంచి జైలులోనే మ్రగ్గుతున్నారు. ఆఖరుకు హృదయంఆగిపోయి, తంజావూరు జైలులో 55 వ యేటనే మరణించారు.

సర్దారువంటి యోధులను గోల్పోయినప్పుడు ఆ వీరులకు జోహారులర్పించడం ప్రజలవిధి. రాజుగారు ఏ ఆశయాలకొరకు తమ జీవితాన్ని అర్పించారో, వాటికొరకు కృషిచేసి భారత స్వాతంత్ర్యాన్ని సాధించితీరుతామని ప్రజాసేవకులందరం శపథం చేదాం.

మనలను వీడిపోయిన నారాయణరాజుగారికి యివే మా జోహారులు. వారి అకాలమరణంవల్ల చింతిల్లుచున్న రాజుగారికుటుంబానికి మా హృదయపూర్వకసానుభూతి.

★ వీరు ప్రజా ప్రతినిధులు కారు! ★

(మొదటి పేజీ తరువాయి) వంశపారంపర్యంగా వచ్చే అస్థులంటున్నారు. వాటిని చీల్చడానికి ఎవరైనా ప్రయత్నిస్తే, సాయుధ పోరాటాలద్వారా ఎదుర్కొనవలసి వస్తుందని బెదిరిస్తున్నారు.

దీని అర్థమేమిటి? దేశాన్ని బ్రిటిషుప్రభుత్వం శాశ్వతంగా తమ అధికారంలో ఉంచుకోడానికి దాష్టరు మూంజీ చక్కని సాకులు చూపుతూన్నాడన్న మాట. "గాంధీ - జిన్నా ఒడంబడిక అమల్లోకివస్తే, దేశంలో రక్తపాతం జరుగుతుంది: దాన్ని ఆపడానికి మేం ఉండాలి." అని అమెరీ మళ్లా చెప్పడానికొక అవకాశం కలుగుతుంది. హిందూమహాసభవారి వైఖరి యిప్పటికైనా దేశానికి తేటతెల్లమయినందుకు సంతోషించవలసిందే.

అకాలీ నాయకుల పోకడ

పంజాబులో కొందరు అకాలీ నాయకులు కూడా యిట్టి వైఖరినే అవలంబిస్తున్నారు. ఈ నెల 12 వ తేదీని మాస్టర్ తారాసింగ్ లయిల్పూరులో జరిగిన అకాలీ సభకు అధ్యక్షత వహిస్తూ, యిలా చెప్పారు:

"రాజాజీప్రణాళికవల్ల సిక్కులకు సర్వనాశనం తప్పదు. అంచేత మనమతాన్ని మనం కాపాడుకొనేటందుకు అందరం సంఘటితమవాలి.... మహాత్ముడు జిన్నాకు లొంగిపోతాడు. రాజీకూడా జరుగుతుంది. అప్పుడు వారిద్దరు కలిసి బ్రిటిష్ ప్రభుత్వంపై బలమైన ఒత్తిడి తీసుకురావడానికి జైలుకు సహితం వెళ్ళడంలో ఆశ్చర్యంలేదు. అప్పుడు సిక్కులు బ్రిటిషు ప్రభుత్వం వద్దకు వెళ్ళి, ఆ సంయుక్త కోర్కెలను అంగీకరించ వద్దని చెప్పుకోవాలి."

కొద్ది రోజుల్లో సిక్కుల తరపున ఒక రాయబారవర్గం బ్రిటన్‌కు వెళ్ళబోతుందనికూడా తారాసింగు తెలియచేశారు.

ఇట్టిపోకడవల్ల బాగుపడేది సిక్కులూకాదు, హిందువులూ కాదు, ముస్లింలూ కాదు. పిల్లి-పిల్లిపోరు కోతి తీర్చినట్లుగా, సామ్రాజ్యవాదులు అందరి తలలమీద చేతులుంచుతారు: బాగుపడేదివారు: మనం కాదు.

నిజమైన ప్రజాప్రతినిధు లెవరు?

పంజాబులో నిజమైన ప్రజాప్రతినిధులు యీ పైఅకాలీ నాయకులూకాదు: హిందూమహాసభవారూ కాదు. సెప్టెంబరు 10 వ తేదీని అమృతసర్‌లో పంజాబ్‌రాష్ట్ర కాంగ్రెసువాదుల సమావేశం జరిగింది రాష్ట్ర కాంగ్రెసు నాయకుడైన డాక్టరు కిచ్లూ అధ్యక్షత వహించారు. సుమారు 400 మంది హాజరయారు. ఈక్రింది తీర్మానం ఏకగ్రీవంగా ఆమోదింపబడింది

"పంజాబ్ కాంగ్రెసువాదులకు ప్రాతినిధ్యం వహించే యీ సమావేశం గాంధీజీ నాయకత్వంలో పూర్తి విశ్వాసాన్ని ప్రకటిస్తోంది. రాజకీయ ప్రతిష్టంభనను అంతంజేయడానికి ఆయన గావిస్తున్న ప్రయత్నాలను యీ సమావేశం పూర్తిగా బలపరుస్తోంది. ముస్లిములకు, యితర అల్పసంఖ్యాకులకు స్వయం నిర్ణయహక్కు ఉండాలనీ, దాని ఆధారంపై కాంగ్రెసు-ముస్లిం లీగుల మధ్య ఒడంబడిక జరగాలనీ, మేం వాంఛిస్తున్నాం.

"గాంధీ - జిన్నాలమధ్య ఒడంబడిక జరిగిననాడు, పరస్పరవిశ్వాసం, అన్యోన్యసహకారం, ఏర్పడగలవు. సంపూర్ణ స్వాతంత్ర్యం కొరకు భారతీయులంతా కలిసి సాగించే పోరాటానికి అట్టి వాతావరణం ఎంతైనా తోడ్పడుతుంది. దేశంలోవున్న అల్పసంఖ్యాకులందరి రాజకీయ - వైజ్ఞానిక హక్కులు గ్యారంటీ చేయబడతాయి.

"నేటి రాజకీయప్రతిష్టంభనను అంతంజేసి, జాతీయప్రభుత్వాన్ని గుంజుకోడానికి గాంధీజీ - జిన్నాలిద్దరిమధ్య సంప్రతింపులు ఫలించి, ఒడంబడిక జరుగగలదని యీ సమావేశం విశ్వసిస్తోంది."

తీర్మానం చర్చకు రాకముందు చాల మంది ప్రతినిధులు తమతమ ప్రాంతాలలో కాంగ్రెసు కమిటీలు రాజాజీ పథకాన్ని బలపరుస్తూ గావించిన తీర్మానాలపై రిపోర్టులిచ్చారు.

డాక్టర్ కిచ్లూ సమావేశాన్ని ప్రారంభిస్తూ, పంజాబు కాంగ్రెసు వాదుల్ని గురించి కాంగ్రెసు శత్రువులు ఎలా విషప్రచారం గావిస్తున్నారో వివరించి, దాన్ని ఎదుర్కోవాలని హెచ్చరించారు. పంజాబ్ కాంగ్రెసు వాదులు గాంధీజీని బలపరచడంలేదనే అసత్య ప్రచారానికి యీ సమావేశం చక్కని జవాబు చెబుతోందని స్పష్టంచేశారు.

పంజాబులో ఎవరూ రాజాజీ ప్రణాళికను బలపరచడంలేదని లాలా బ్రిజలాల్ (హిందూమహాసభ) అన్న మాటల్లో ఎంత యదార్థముందో పై సమావేశం వెల్లడిచేస్తుంది.

11 వ తేదీని అమృతసర్‌లో జరిగిన 200 మంది సిక్కు కాంగ్రెసు వాదుల సమావేశంలో కూడా యిట్టి తీర్మానమే ఏకగ్రీవంగా ఆమోదింపబడింది. తారాసింగువంటి అకాలీ నాయకుల పంథా సామ్రాజ్యవాదాన్ని బలపరిచేపంథా తప్ప మరొకటి కాదని సిక్కు ప్రజాసామాన్యం త్వరలోనే గ్రహించుతుంది.

మన స్వాతంత్ర్య సమరంలో అతి ప్రధానమైన ఘట్టం నేడు సమీపించింది. గాంధీ - జిన్నా సంప్రతింపులవల్ల కాంగ్రెసు - ముస్లింలీగుల మధ్య అభేద్యమైన ఐక్యత ఏర్పడబోతుంది తారాసింగులు, దాక్టరు మూంజీలు, ఆ మహా వెల్లువను ఆపలేరు: సామ్రాజ్యవాదులు ప్రజావెల్లువ అనే అదకత్తెరలో చిక్కుకుంటారు. అటు బ్రిటిషుప్రజలు, అమెరికన్లు మన అండనున్నారు. ఇటు 40 కోట్లమంది భారతప్రజాసామాన్యం తన శక్తితో జాతీయప్రభుత్వాన్ని గుంజుకోకమానదు.

అట్టి శుభముహూర్తంకొరకు దేశం ఎదురు చూస్తోంది.

— కంభంపాటి సత్యనారాయణ

"సువరావ్ జీవితం"
(సోవియట్ ఫిలిం)

"గొంతులో కొనఊపిరి ఉండేంతవరకూ నీ దేశం యెడల శక్తి విశ్వాసాలుకలిగి వుండు - ఇదే నా ఆదేశం" అంటూ తన దేశీయులను ప్రబోధించాడు సువరావ్.

ఎవరీ సువరావ్?

సువరావ్ ప్రఖ్యాతిగన్న రష్యన్ యుద్ధవీరుడు. ఓటమి యెరుగని యోధాగ్రేసరుడు. సాటిలేని యుద్ధతంత్రజ్ఞుడు.

సువరావ్ మాస్కోలో 1730 లో జన్మించాడు. బాల్యం నుండీ యుద్ధం అభిమానవిద్య. 1747 లో 'కార్పరల్'గా మిలిటరీ జీవితం ప్రారంభించాడు. జర్మన్లతో, టర్కీవారితో, పోలిష్‌వారితో, ఫ్రెంచివారితో పోరాడాడు. 'ఫీల్డుమార్షల్' అయాడు.

1760 లో బెర్లిన్‌ను ఆక్రమించుకోడంలో ప్రముఖపాత్ర వహించాడు. బెర్లిన్ కోటగోడ తాళాలింకా సోవియట్ మ్యూజియంలో ఉన్నాయి.

"రష్యన్లకు అడ్డువచ్చేది ఏమీలేదు." అంటూ తన సైనికుల్ని ప్రబోధిస్తూ ఆల్ప్సు పర్వతశ్రేణిలో దాటవీలులేని గొథార్డ్ పర్వతాలను, డెవిల్‌బ్రిడ్జిని దాటాడు.

సువరావ్ తన జీవితంలో 63 యుద్ధాలుగావించాడు. కాని ఎన్నడూ, ఏ ఒక్క యుద్ధంలోకూడా ఓడిపోలేదు. "నా సైన్యం జీవంలేని యంత్రంగాదు. అది ప్రజలకోసం ప్రాణాలర్పించే ప్రజాసైన్యం" అంటూ తనవిజయాలలోని రహస్యం తెలియజేశాడు.

సువరావ్ 1800 లో మరణించాడు. నేడు అమహనీయుని యుద్ధవ్యూహాలను, తంత్రాలను, ఆధునికపరిస్థితుల కనుగుణ్యంగా అన్వయింపజేయడంవల్ల, అనేకవిజయాలను రష్యన్లు సాధించారు.

1942 లో సోవియట్ ప్రభుత్వం "ఆర్డర్ ఆఫ్ సువరావ్" అనే బిరుదును, సృష్టించింది. 1943లో "సువరావ్ విద్యాలయాల"ను పెట్టి యువకులకు తర్ఫీదునిస్తోంది.

అట్టి సువరావ్ జీవితం ఫిల్ముగా తీయబడింది. ఈ నెల 23 వ తేదీ నుండి శ్రీ లక్ష్మీటాకీస్ (బెజవాడ) లో చూపించబడుతుంది. మిగిలిన ఆంధ్ర ప్రాంతాలలో కూడ ఈ ఫిల్ము త్వరలో ప్రదర్శింపబడుతుంది.

★ చిన్న కథ

భాయ్ భాయ్ ★

చాగంటి సోమయాజులు

అబ్దుల్లాకీ, అప్పలస్వామికీ స్నేహం ఈనాటిది కాదు. చిన్ననాటిది. కుర్రాళ్ళగా బిల్లా కర్రా ఆడుకొన్నారు. పీక్లు పట్టుకుని ఇద్దరూ గుండాలు తొక్కేరు. పెద్దయాక ప్రతిఏటా అప్పలస్వామి. పీర్లపండక్కీ, అమ్మవారి పండక్కీ కూడా పులివేషం వేస్తున్నాడు.

వాళ్లమైత్రి నానాటికి మర్రిచెట్టులాగ విస్తరించి ఊడలు దించింది. అంచేతే వాళ్ళిద్దరూ జాయింటుగా దుకాణం పెట్టుకుని బతగ్గలుగుతున్నారు. రోడ్డువార సాల వేసుకొని రోడ్డు మీదికి కిళ్ళీదుకాణం, సాలలో టీ దుకాణం, పెట్టుకుని బాగా సంపాదించుకొంటున్నారు. ఆదారినిపోయే పాటకజనమంతా వాళ్ళ దుకాణంలోనే చవగ్గా "చా" తాగుతారు.

అబ్దుల్లాకి తెనుగొచ్చు. అప్పలస్వామికి తురకమొచ్చు. అబ్దుల్లా తపలా వాయిస్తాడు. అప్పలస్వామి హార్మణీ వాయిస్తాడు ఇద్దరికీ పాడ్డంవొచ్చు. అప్పలస్వామి తత్వాలు, కీర్తనలు, పదాలు అబ్దుల్లాకొచ్చు. అబ్దుల్లా "గజల్లు"న్నీ అప్పలస్వామికొచ్చు.

సాయంకాలం ఆరుగంటలకి వేరుశనగ మిల్లునుంచి వచ్చే కూలీలలో తాగుడుకి తడిలేనివాళ్ళంతా "చా" తాగి వెళ్లడమైంది. దాంతో టీకి బేరాలవేళ దాటిపోయింది. తపలాతీసి తలెగరేస్తూ అబ్దుల్లా వాయించడం మొదలెట్టేడు. మోకెత్తిపాడుతూ హార్మణీ తీశాడు అప్పలస్వామి. అక్కడికి పాచా వచ్చాడు. పాచారాగానే పాట ఆగిపోయింది.

"నా కంజీరా ఏదీ?" అని తురకంలో అడిగాడు అబ్దుల్లా.

"ఉమములోలు ఇంకా సావుకాలంచే?" అన్నాడు తురకంలో పాచా.

"అమ్మవారి పండక్కి కావ్యావేషం కట్టాలి. కంజీరా బాగా అవసరం" అన్నాడు తురకంలో అప్పలస్వామి. అక్కణ్ణుంచి వాళ్ళ సంభాషణంతా తురకంలోనే సాగింది.

"అప్పటికి ఇస్తానులే" అన్నాడు పాచా.

"కార్తవీర్య తెచ్చాము చూశావా?" అన్నాడు అప్పలస్వామి.

"మొన్న చూశాను" అన్నాడు పాచా.

పాచాకిఅప్పలస్వామిమీదఅంతరంగికంగా ద్వేషంఉన్నది. వాడు హిందువుకావడాన్నో, లేక అబ్దుల్లాతోకలిసి దుకాణంమీద బాగా బతుకుతూ ఉండడాన్నో కారణం సరిగ్గా పాచాకే తెలీదు.

"మీకు సలహాఇవ్వాలి" అన్నాడు పాచా.

"ఇయ్యి!" అన్నాడు అబ్దుల్లా.

"మీ సాలకి అటు హిందూ టీ అనీ, ఇటు మహమ్మదీయ టీ అనీ, బోర్డులు కట్టండి!" అన్నాడు పాచా.

"ఎందుకూ?" అన్నాడు అబ్దుల్లా.

"రైలుస్టేషన్లలో చూడలేదా?" అన్నాడు పాచా.

"ఏమిటి లాభం?" అన్నాడు అప్పలస్వామి.

"హిందూ టీ అనుకొని హిందువులొస్తారు, తురక చా అనుకొని తురకలొస్తారు," అన్నాడు పాచా. పాచా, ఇద్దరూ రాకంటా ఉంటే బాగుణ్ణనుకొన్నారు. వాడి ద్వేషానికి కారణం వాళ్ళు బాగా బతుకుతున్నారనే.

"అనవసరం" అన్నాడు అప్పలస్వామి.

"మీది ఏ టీ దుకాణమో తెలియడమెలాగ?" అన్నాడు పాచా.

"మా "టీ" ఏమి "టీ"వో అంతా ఎరుగుదురు. దీకాషనులో పాలూ పంచదారా కలిపితే తియ్యని తేనిరౌతుంది. తురక, హిందూ చా లు మాకు తెలియవు" అన్నాడు అప్పలస్వామి

"అచ్చాబోల్తాహై" అన్నాడు అబ్దుల్లా.

పాచా పకపక నవ్వేడు.

"అబ్దుల్లా! ఇక్కడ గానా బజానా పెట్టేవు. మీటింగుకు రావా?" అన్నాడు పాచా.

"ఎంతపని! మరిచిపోయాను" అన్నాడు అబ్దుల్లా.

జల్దీగాలేచి పాచాతో అబ్దుల్లా మీటింగుకెళ్లాడు. మశీదునక్క మైదానంలో ముస్లిమ్ లీగ్ యాజమాన్యంకింద సభ జరిగింది. వంగరాష్ట్రంనుంచి లీగ్‌సభ్యుడు వచ్చాడు. అతని ఉపన్యాసం ఆవేళ. ఆయనవర్తకరీత్యా వస్తే, స్థానిక లీగ్ కమిటీవారు సభ ఏర్పాటుచేశారు.

ఉపన్యాసం ప్రారంభమైంది. అబ్దుల్లాకేం బోధపడలేదు.

"ఈయనభాష ఇలాగుందేం?"అని పాచా నడిగేడు.

"ఉత్తరదేశం వాడుకదా!"అన్నాడు పాచా

వంగనాయకుడు కొంచం మాట్లాడిన తరువాత పేష్మాగారు లేచి ఉర్దూలో చెప్పడ మారంభించారు.

"ముసల్మాను సోదరులారా! నాకు ఉర్దూ రాదు. నా మాతృభాష బెంగాలీ. అంచేత మీ పేష్మాగారు అనువదించి చెపుతారు. ఉర్దూలో చెప్పలేనందుకు చాలా సిగ్గుపడుతున్నాను. క్షమించవలసిందని ప్రార్థించుచున్నాను."అని పేష్మాగారు తర్జుమా మొదలెట్టాడు.

"బంగాళీ ముస్లిములకి తురకంరాదా?" అన్నాడు అబ్దుల్లా.

"కాబోలు" అన్నాడు పాచా.

వంగనాయకుడు పిర్‌పూర్ ప్రణాళికను ఆధారంచేసికొని హిందువుల్ని విమర్శించాడు. పాకిస్తాన్ సూత్రాన్ని వివరించాడు. లీగ్‌ని బలపరచవలసిన ఆవశ్యకతని తెలుపుడు చేశాడు. కరతాళధ్వనులతో, "ముస్లింలీగ్, జిందాబాద్" కోలాహలంతో సభ ముగిసింది.

అబ్దుల్లాకి లీగ్ ఛోగట్టా ఆదివరకు తెలియదు. రాజకీయ దృక్పథమే అతనికిలేదు. పాచా పదిమీటింగులకెళ్లి హిందువులపై చిన్న ద్వేషభావం పెంచుకున్నాడు.

"మనకిన్ని గొడవలున్నాయా?" అన్నాడు అబ్దుల్లా.

"ఇంతేనా? నువ్వింకా అన్ని సంగతులూ తెలుసుకోవాలి" అన్నాడు పాచా.

"కాని ఈసభ సంగతులు అప్పలస్వామికి చెప్పకేం?"

"ఏం?"

"జట్టి రాదా?"

"నాకెందుకు? చెప్పనులే, కాని నువ్వే ఎప్పుడో అప్పుడు వాడితో విడిపోతావు సంగతులన్నీ నీకు తెలియవు"

"అలాంటిమాట, మాయిద్దరికీ ఎప్పుడూ జగడంరాదు!"

"వొస్తుందని నువ్వే మొదటన్నావు!"

"అనుకున్నాను కాని, రాదు!"

"ఐతే చెప్పనా?"

"చెప్పు, భయంలేదు!" అన్నాడు అబ్దుల్లా. మొదట సందేహించినా, తరువాత జట్టిరాదని ధ్రువపర్చుకొన్నాడు. ఎంచేతంటే, వాళ్ళు మనుష్యులు వేరైనా మనస్సులు ఒక్కటే.

ఇద్దరూ కొట్టుకొచ్చారు.

"మీ ఇద్దరూ మాదేశంలో ఉంటారా, పాకిస్తాన్‌కి పోతారా?" అని అప్పలస్వామి వాళ్లిద్దరూ రాగానే అడిగేడు.

"అప్పుడే నీ కెవరు చెప్పేరు?" అన్నాడు అబ్దుల్లా.

"రజాక్ అంతా చెప్పేడు." అన్నాడు అప్పలస్వామి.

"మాకు పాకిస్తాన్ వచ్చితీరుతుంది!" అన్నాడు పాచా.

"ఐతేతీసుకోండి!"అన్నాడు అప్పలస్వామి.

"మీరిస్తారా?" అన్నాడు పాచా.

"తప్పకుండా ఇవ్వవలసిందే" అన్నాడు అప్పలస్వామి.

మీరెక్కడొప్పుకుంటారు!"అన్నాడుపాచా.

"ఎవ్వరేనా ఒప్పుకుంటారు. నేనొప్పుకుంటాను" అన్నాడు అప్పలస్వామి.

"నువ్వయితే మంచివాడివే! పెద్దవాళ్ళను కొన్నాను" అన్నాడు పాచా.

అంతసేపూ వాళ్ళు తురకంలోనే మాట్లాడుకొన్నారు.

అప్పలస్వామి తన అచ్చ తెనుగులో యిలా చెప్పేడు:

"మంచికేటుంది? మాతాతగోరికి యింటిలో నలుగురన్నదమ్ములు. పెద్దోళ్ళయినాక, తగువులాడుకొన్నారు. ఆస్తులు పాయింపు చేసుకొని, ఎవడిపాయ్యి ఆడు ఎట్టుకున్నాడు. 'అ తగువులన్నీ పోనాయి. ఇప్పుడంతా భాయ్ భాయ్. ఆదికష్టానికీదూ అవుతున్నారు; ఈదికష్టానికాదూఅవుతున్నారు. రజాక్ కాద నాకు ఇన్నమాటుంటే, దేశంలో ఒకొంతుమీరూ, రెండొంతులు మేమూ ఉన్నామట. తగాదాకేటుంది? పంపకమెయ్యండి. మీమొంతు మీరొట్టుకుపొండి. మారెండొంతులు మాకొగ్గీయండి!" అన్నాడు అప్పలస్వామి.

"బహుతచ్ఛాహై" అన్నాడు అబ్దుల్లా.

"అంతా నీలాటివాళ్ళుకారుకదా?" అని తురకంలో చెప్పేడు పాచా.

"మీలోనూ,మాలోనూ పెద్దబుర్రలులేవా!" అని తన స్వంత అచ్చ తెనుగులో అప్పలస్వామి చెప్పేడు. పాచాకి కూడా బొనవి తోచింది.

"అచ్ఛా భాయ్!" అన్నాడు."

బురుజుల గ్రామ రైతుసంఘం
రైతాంగానికి మార్గం చూపుతోంది!

దాదాపు రెండుమాసాలైంది, బురుజుల గ్రామంలో (పత్తికొండతాలూకా) వర్షాలులేవు. పైరులు యెండిపోతున్నాయి. గ్రామంలో కూలీలు పనుల్లేక తహతహలాడుతున్నారు. రైతుసంఘవర్కర్లు యీ సంగతి తెలుసుకొని, రైతులదగ్గరికి వెళ్ళారు. కూలీల ఆగచాట్లు చెప్పారు. రైతుకూలీ - సామరస్యం యొక్క అవసరాన్ని గుర్తింపచేశారు. తత్ఫలితంగా, పశువులకు వేసవికాలములో నీరు నిలువచేయడానికి ఒక కుంట త్రవ్వించి, తద్వారా రైతులు కూలీలకు పనులు కల్పింపనిశ్చయించారు. రైతుసంఘ సూచనప్రకారం ఎకరాకు 0-1-0 ప్రకారం రూ. 254-0-0లు వసూలు చేయబడింది. 26-8-44 నుండి 30-8-44 వరకు 5 రోజులు జయప్రదంగా పనిజరిగింది. ప్రతిదినము 175 గురు కూలీలు పనిచేశారు. పనిఅంతా 1 రు. కు. 2¾ చదరపు గజాల ప్రకారం కంట్రాక్టు ఇవ్వబడింది. పురుషునికి 0-7-0; స్త్రీకి 0-5-0; పిల్లలకు 0-3-0 చొప్పున కూలీ పడింది. ఈదబ్బుకు, స్టోర్సులో రూపాయికి 5 శేర్ల చొప్పున జొన్నలు కంట్రోలు రేటుకు ఇప్పించబడ్డాయి.

ఈ విధంగా గ్రామంలో రైతు - కూలీల మధ్య సాధింపబడిన ఐక్యతకు ఒకరిద్దరు (కష్టయిన్నప్పుడు లాభాన్ని పొందుతున్నవారు) కన్నుకుట్టి, గ్రామంలోని ధాన్యాన్ని బయటకు పంపకూడదన్న రైతుసంఘ నిర్ణయాన్ని విచ్ఛిన్నము చేయుటకు ప్రయత్నించారు. కంట్రోలు రేటుకు ధాన్యాన్ని స్టోర్సుకు యివ్వటం రైతులకునష్టమని ప్రచారంచేశారు. చాటుగా ఎక్కువధరలకు ధాన్యాన్ని ప్రక్క గ్రామాలకు అమ్మ ప్రయత్నించారు. 1-9-44 రాత్రి 6¾ బస్తాల జొన్నలు రూపాయికి 4¾ శేర్ల చొప్పున పంప ప్రయత్నించారు. రైతువాలంటీర్లు రాత్రి కాపువేసి, దొంగదారిన పోవుచున్నబండిని పట్టుకొని, స్టోర్సుకు ఆ ధాన్యాన్ని కంట్రోలు రేటుకు ఇచ్చునట్లు చేశారు.

ఒక పత్తికొండవ్యాపారి రహస్యంగా రూపాయికి కు 4¾ శేర్లుచొప్పున 144¾ శేర్ల ధాన్యంకొని తీసికొనిపోవ ప్రయత్నించగా, రైతు వాలంటీర్లు ఆధాన్యాన్ని పట్టుకొని, స్టోర్సుకు కంట్రోలురేటుకు యిప్పించారు. ఈవిధంగా రైతుసంఘ కృషిఫలితంగా, బురుజులలో ధాన్యం సరియైన ధరకు అమ్మబడుచున్నవి. దీన్ని చూచి యీసంవత్సరం రైతులంతా రైతుసంఘంలో చేరి సంఘాన్ని బలపర్చుకుంటున్నారు.

రేషనింగు జయప్రదం గావాలంటే- ప్రజాసహకారం అవసరం

— టి. వెంకటేశ్వరరావు
(పట్టణ ఆహారకమిటీ కార్యదర్శి.)

"బియ్యం ఎక్కడైనా దొరుకుతాయండీ? ఏ దుకాణంలో చూచినా లేవంటారు. మిల్లు లసలే అమ్మటంలేదు. ఉద్యోగం మానుకుని తిరుగుతున్నాను నిన్నటినుండి"—

అంటూ ఆఫీసు గుమాస్తాలు.

"శాస్త్రి పాలిష్‌బియ్యం ఎక్కడైనావుంటే ఒకసావుబస్తా యిప్పించండి."

అని ప్రతిరోజూ తిరిగే ప్లీడర్లు, యితర విద్యావంతులు.

"అయ్యో! ఈ కంట్రోలెందుకండీబాబు! మీ రేమో చాల శ్రమపడి ఎక్కడెక్కడ నుండో బియ్యం తెప్పిస్తున్నారు. అవి మరీ చేదిబియ్యం అండి. దంచుకుంటే నికరం శిక్షేర్లకు తక్కువే వొస్తున్నాయండి"

అంటూ తమబాధను వెలిగక్కే బీదప్రజలు.

ఇదీ సస్యశ్యామలమై, వరిపంట పండించే కృష్ణాజిల్లా మధ్యవున్న బెజవాడ పట్టణం దుర్గతి. రేషనింగు ప్రారంభించకముందు. ఈ వూళ్లోనే 15 మిల్లు లున్నాయి. తన అవుసరాలకు సరిపోను ఎన్నోవేల టన్నుల బియ్యాన్ని తరుగుప్రాంతాలకు పంపే జిల్లా! అలాంటిచోటనే బియ్యం దొరకక యిబ్బంది పడటానికి కారణం ఏమిటి?

రేషనింగు వాయిదా

1943 సెప్టెంబరులో రేషనింగు ప్రవేశ పెడతామని జనాభాలెక్కలు తయారుచేశారు. అంతే! 1944 మార్చిలో రేషనింగు ఆఫీసు పెట్టారు. కాని మళ్ళీ వాయిదాపడింది. ఇలా వాయిదాలు పడటంవల్ల పైవిధంగా అన్నితరగతుల ప్రజలు బియ్యందొరకక బాధపడసాగారు.

మిల్లు యజమానులు, సిల్కువ్యాపారస్తులు బియ్యం లేకుండా చేయడానికి కాయకష్టుల కృషిచేశారు. కంట్రోలుధరకు తమకు గిట్టుబాటుకాదని మిల్లులు కట్టివేసారు, బియ్యం కంట్రోలుధరకు అమ్మనిరాకరించారు. దొంగ మార్కెటులో బియ్యం బస్తా 13 రూ. 45 వరకు అమ్మకంసాగించారు. "ఎందుకొచ్చిన కంట్రోలు! రేషనింగు పెడతామనడంవల్లనే యీ కష్టాలన్నీ బాబూ!" అని అమాయక ప్రజలు భావించేటట్లు చేశారు.

పట్టణ ఆహారకమిటీ ఈమోసాన్ని ప్రజలకు వెల్లడిచేసింది. ప్రజలందరికిసక్రమధరకు బియ్యం అందడానికి రేషనింగు ఎలా అవసరమో ప్రచారం చేసింది. వుయ్యూరు, పామర్రు, తెలప్రోలు వగైరా మిల్లులనుండి బియ్యం తెప్పించి ప్రజలకు అందచేసింది. రేషనింగు వెంటనే అమలులోకి తేవాలని బహిరంగసభలద్వారా ఆందోళనచేసింది.

ఈ ఆందోళన ఫలితంగా, ఎలాగైతేనేం అధికారులు కదిలారు. దాదాపు 40,000 బస్తాల బియ్యం తెప్పించారు. సెప్టెంబరు 3 వ తేదీన రేషనింగు ప్రారంభమయింది.

ప్రజా సహకారం

రేషనింగు అధికారులు మొదటినుండి ఆహారకమిటీతో సంబంధం కలిగించుకున్నారు. కమిటీ సహకారం లేనిదే ఎలా తమ యత్నాలు పూర్తిగా ఫలప్రదంకావో గ్రహించారు. జూలై, ఆగస్టు నెలల్లో రేషనింగును గురించి వీధిమలుపు మీటింగులు. వేలకొలది కరపత్రాలమూలంగా సాధారణ ప్రజల్లో మిల్లు యజమానుల దుష్ప్రచారాన్ని ఎదుర్కొని, రేషనింగు ఎలా అవసరమో గుర్తింపచేయడం గ్రహించారు. అందువల్లనే కార్డులు పంచిపెట్టే తరుణంలో వాలంటీర్ల సహాయం కోరారు. కార్డులు రానివారికి వెంటనే పిటిషన్లు వ్రాయబడ్డాయి. వార్డు వార్డుకు మిగిలిపోయినవారిలో ఎక్కువ భాగం ప్రజలకు, రేషనింగు నియమాలను జయప్రదం చేయుటకు మనమంతాఎలా కృషి చేయాల్సిందీ తెల్పుతూ, వాలంటీర్లు పిటిషన్లు తయారుచేశారు. ఇంకా మిగిలిన వారిని 3 వ తేదీ ఆఫీసువద్దకు రావలసిందిగా కోరుతూ, బాకాలద్వారా వీధి వీధినా ప్రచారంచేశారు.

3 వ తేదీ రెండు సర్కిళ్ళలోవున్న రెండు రేషనింగు ఆఫీసులవద్ద ప్రజలకు ఫారాలు పూర్తిచేయుటకు దాదాపు 60 మంది వాలంటీర్లు; ప్రతిరేషనింగు షాపువద్ద యిద్దరు వాలంటీర్లు నిలబడ్డారు. మొత్తం షాపులు 74. ఇందులో దింపుడు బియ్యానికి ప్రత్యేకంగా రెండుషాపులు. తమాషాఏమంటే, 3 వ తేదీన చాల ప్రాంతాలలో రేషనింగు అమలు కాలేదని ప్రచారం సాగించారు మిల్లు యజమానులు. అందుచేత ఎక్కువమంది ప్రజలు రేషనింగు షాపులవద్ద కొనలేదు.

వాలంటీర్లు ఆఫీసువద్ద, మకాములవద్దచేసే కృషిచూసి, రేషనింగు అధికార్లు సహితం మెచ్చుకోక తప్పలేదు "మీరు లేకపోతే యీ జనాభా గందరగోళానికి మేము ఆఫీసులు మూసుకోవలసి వచ్చేదే!" అంటూ ఆఫీసర్లు ప్రశంసించారు. ఎంతో ప్రయాసతో, ఓపికతో, వందలకొలది ఫారాలు పూర్తిచేస్తున్న వాలంటీర్లను ప్రజలు అభినందించారంటే, ఆశ్చర్యం ఏముంది? 4, 5, 6 వ తేదీలలో గూడ రేషనింగుఆఫీసువద్ద వాలంటీర్లున్నారు. టెంపొరరీకార్డులు వెంటనేయిప్పించబడ్డాయి. యీనాడు కార్డులేక బియ్యం దొరకక యిబ్బందిపడేవారు దాదాపు లేరనేచెప్పవచ్చు.

మిల్లు యజమానుల దుష్ప్రచారం వటా పంచలైంది. "ముదిబియ్యంయిస్తారు; అసలు రేషనింగురాదు" అని చేసినతప్పుడు ప్రచారం ఆగిపోయింది. దాగా తెల్లటిబియ్యం యిస్తున్నారు. ప్రజలంతా ఆనందంగావున్నారు.

ఇంకా నాటకమే!

రేషనింగు స్టాండర్డు ప్రకారం బియ్యం యివ్వక, పాలిష్ తక్కువ పెట్టిన [illegible] కుటుంబరావుగారి వేణుగోపాల రావారైస్ మిల్లుపై రిపోర్టులు చేయబడ్డాయి. అధికార్లు వెంటనే వార్నింగు యివ్వటమేగాక, డిపోలకు తోలిన బియ్యాన్ని మిల్లుకు [illegible] తిరిగి తోలించి, ఆడించి [illegible] బియ్యాన్ని డిపోలకు సప్లయిచేశారు. ఇంకోసారి యిల్లాచేస్తే, డిపాజిటు సొమ్ము స్వాధీనం చేసుకొని, మిల్లును రద్దుచేస్తామని రేషనింగ్ ఆఫీసరు చెప్పారు.

ఇప్పటికి వచ్చిన లెక్కలప్రకారం పట్టణంలో 32,000 కార్డులు పంచిపెట్టబడ్డాయి. ఈ నెల 3 నుండి 10 వ తారీఖుతో అంతమయ్యే వారంలో ఖర్చయిన బియ్యం 2,300 బస్తాలు. యివివారానికి కావలసిన ఖర్చులో నూటికి 48 వంతులు మాత్రం.

రేషనింగు విషయంలో తన సలహాలు యివ్వటానికి రేషనింగును జయప్రదంచేయడానికి "రేషనింగు కమిటీ" ఏర్పాటు చేయబడింది. అందులో 1 మిల్లు యజమాని, 2 రిటైల్‌షాపులవారు, 1 శ్రీ. పట్టణ ఆహారకమిటీ సెక్రటరీ. 1 సిటీ ట్రేడ్‌యూనియన్ కౌన్సిలు సెక్రటరీ, తదితరంగా ఏడుగురు పురప్రముఖులున్నారు. ఆఫీసులో గుమస్తాలు, ఆఫీసర్లు ఎంతో ఓపికతో, కాలనిర్ణయంతో నిమిత్తంలేకుండా ప్రజలకు కార్డులు యివ్వటంలోను తదితర సహాయం చేయటంలోను,తోడ్పడుతున్నారు.

పట్టణంలో వున్న అన్నివర్గాలు రేషనింగుకు అనుకూలంగా వున్నారు. ఇంతకు ముందు వ్యతిరేకించిన కొంతమంది మేధావంతులు సహితం చాల బాగుందని అంటున్నారు. చిన్నచిన్న లోపాలను సర్దుతూ, బియ్యం మేలురకం యిస్తూ, కావలసిన సప్లయిలు అడ్వాన్సుగా ఒకనెలముందే తెప్పించుకుంటే. యీనాటి ప్రజాసహకారంతో రేషనింగు స్కీముకు జయప్రదం చేయగలం.

ఆటంకాల నెదుర్కొంటూ ఆహారసమస్యను పరిష్కరించుకోవడంఎలా?

నర్సారావుపేట తాలూకాలో చిలకలూరిపేట జనాభా 13000. రోజుకు పెద్దవానికి సోలెడు. చిన్నపిల్లలకు అరసోలెడు. లెక్కప్రకారం మొత్తం నెలకు1650 బస్తాలబియ్యం ఈ గ్రామాని కవసరం.

మేనెలనుంచి యిచట దొంగమార్కెట్ విస్తారంగా వ్యాపించింది ప్రభుత్వం ఎట్టి ప్లానింగులేకుండా, ధాన్యంఉన్నంతవరకు ఒకే డిపోలో ప్రతివ్యక్తికి రు. 1-0-0 బియ్యం చొప్పునఅమ్మించింది. కాని, బలంఉన్నవారికే బియ్యం దొరికేవి. అవత్తిడికి తట్టుకోలేక అనేకమంది వెనక్కు వెళ్ళిపోయేవారు. ఒక మంగలిస్త్రీ జనసమ్మర్దంలో నలిగి, 2 రోజుల తర్వాతప్రాణాలు విడిచింది. ఈపరిస్థితుల్ని తొలగించడానికి ఎక్కువడిపోలుఅవసరమని ఆందోళన చేశాం. తత్ఫలితంగా 5 డిపోలు తెరువబడ్డాయి. ప్రభుత్వం తాత్కాలిక రేషనింగును అమలుపరచింది.

షాహుకార్లు తమ దొంగవ్యాపారానికి దెబ్బ తగిలిందని, కంట్రోలురేటుకే సరుకు అమ్మవలసివచ్చిందని తెలుసుకొని, రేషనింగును భగ్నంచేయడానికి ప్రయత్నించారు. రేషనింగు బీదలచావుకు వచ్చిందన్నారు. రోజూ తవ్వెడు బియ్యమైనా తినకపోతే కూలీలు యింకేమి పనిచేస్తారన్నారు. అధికారులు నెలకు 2000 బస్తాలవరకు పెర్మిట్లు యిస్తే, సరుకును పూర్తిగా తెప్పించక. 10 రోజుల కొకసారి 205 బస్తాల చొప్పున తెప్పిస్తూ, నెలకు 16 రోజులు డిపోలలో బియ్యంలేకుండా చేశారు. ఇదీ వీరు కూలీలపట్ల చూపిన దయ!

ఇట్టిపరిస్థితుల్లో గ్రామంలో ఆహారకమిటీ ఏర్పడింది. వర్తకులు 10 రోజుల్లో మొత్తం బియ్యాన్ని తేవాలనీ, అలా తేకపోతే వారి లైసెన్సులు రద్దుచేయబడాలనీ, డిప్యూటీ కలెక్టరుకు ఆహారకమిటీ రికమెండ్ చేయాలని నిశ్చయించింది. దీనితో షాహుకార్ల పన బయటపడింది. అదివరలో దాదాపు 2 నెలలపాటు దొరకని బియ్యం 10 రోజుల్లో వచ్చిచేరాయి; గ్రామ ఆహారకమిటీ కిదొక పెద్దవిజయం.

ఇలా షాహుకార్ల అటకట్టినా, స్థానిక ప్రభుత్వోద్యోగులు పరిస్థితుల తీవ్రతను అర్థం చేసుకోలేదు. తడవకు 200 బస్తాల అమ్మకానికి మాత్రం అనుమతి యిచ్చేవారు. అస్టాకు అయిపోయి, డిపోలు మూతబడిన వారం పదిరోజులకు. మరో 200 బస్తాలకు అనుమతి యిచ్చేవారు. నెలకు 1650 బస్తాలు కావలసియుండగా, 2000 బస్తాల బియ్యాన్ని 3½ నెలలకు సర్దారు. 79 రోజులలో 29 రోజులు డిపోలు మూతబడి వున్నాయి! 16-8-44 నుంచి డిపోలు పూర్తిగా మూతబడివున్నాయి. (9-9-44 నాటి రిపోర్టు)

క్రిందటి నెలలో కొత్తగా మరొక 4400 బస్తాలబియ్యానికి అధికార్లుపర్మిట్లుయిచ్చారు. కాని షాహుకార్లు సరుకును విరివిగా తెప్పించడానికి ఎట్టి ప్రయత్నం చేయలేదు. కంట్రోల్ రేటుకుసరుకుదొరకడంలేదని బుకాయించారు. అటు అధికార్లు పర్మిట్లు యివ్వారేగాని, వాటి ప్రకారం సరుకు వస్తోందా, లేదా? రాకపోతే, ఎందుకు రావడంలేదు? మొదలైన విషయాలలో శ్రద్ధ కలిగించుకోలేదు. ఈ పరిస్థితులన్నింటిని గురించి గ్రామ ఆహారకమిటీ ప్రజలకు విపులంగా తెలియజేస్తూ ప్రతిపేటలోను బహిరంగసభలు పెట్టింది. షాహుకార్ల అత్యాశ, స్థానికోద్యోగుల ఉపేక్షాభావం, ఎల్లా ఆహారసమస్యను విషమింపజేశాయో తెలియచెప్పారు.

2-9-44 వ తేదీని 200 మంది కూలీలు పనిమానుకొని, తహసిల్దారు వద్దకు వెళ్ళారు. నేను కూలీల తరఫున పర్మిట్లు యిచ్చిన బియ్యాన్ని విడుదలచేయించమనీ, యీలోగా గ్రామంలోని ఒక షాహుకారువద్ద 2 నెలలుగా నిల్వవున్న 190 బొన్నల బస్తాలను అమ్మించమనీ, తహసిల్దారును కోరాను. తహసిల్దారు మొదట కూలీలపైవిరుచుకుపడ్డా, యీ సూచనను అంగీకరించక తప్పిందికాదు.

ఇది జరిగిన మరునాడు (3-9-44) 2000 మంది ప్రజల సంతకాలతో మహజర్లు జిల్లాకలెక్టరు ఆఫీసుకు వచ్చి చేరాయి. 4 వతేదీని వివిధ పేటలనుండి 5 టెలిగ్రామ్‌లు వెళ్లాయి. గ్రామ పరిస్థితినిగూర్చి విచారణ చేయడానికి 8-9-44 వ తేదీని జిల్లాకలెక్టరు చిలకలూరుపేటకు వచ్చారు. 600 మంది కూలీలు పనిమానుకొని, ఉదయం 8.30 కు రహదారీ బంగాళాకు వచ్చారు. మధ్యాహ్నం 2 గంటలకు జిల్లాకలెక్టరు రాగానే, నేను ప్రజల తరఫున గత 4 మాసాలనుండి యెలా గ్రామంలో ఆహారపరిస్థితి విషమిస్తుందో వివరించి చెప్పాను. డిపోలు మూతబడకుండా ప్రతిరోజూ సరుకు అమ్మేలా చేయవలసిందనీ, పెర్మనెంటు రేషనింగుకై రికమెండుచేయవలసిందనీ, కోరాను. స్థానికాధికారుల ఉపేక్షాభావాన్ని అరికట్టవలసిందని చెప్పాను. కలెక్టరు అంతా శాంతంగా విన్నారు. తక్షణమే 800 బస్తాలబియ్యం యిప్పిస్తానని వాగ్దానం చేసి, రివెన్యూఇన్‌స్పెక్టరును, షాహుకార్లను, తనవెంట తీసుకువెళ్ళారు. పెర్మెనెంట్ రేషనింగుకు రికమెండుచేస్తానని చెప్పారు. స్థానికాధికారులుఇబ్బందిపెడితే, తనవద్దకుఅవసరమైనప్పుడల్లా ఇంటర్వ్యూకు రావలసిందన్నారు.

సంఘబలమంటే యేమో ప్రజలంతా తెలుసుకున్నారు. కూలీలు విరివిగా కూలిసంఘాలలో సభ్యులుగా చేరుతున్నారు.

— ఎం. బాలసుబ్రహ్మణ్యం

ఎల్. ఐ. ఎం. విద్యార్థుల సమ్మె

సమ్మెదారులకు విజ్ఞప్తి

— మద్దుకూరి చంద్రశేఖరరావు

యల్. ఐ. ఎం. మెడికల్ స్కూలు శ్రీ పానగల్‌రాజా మంత్రివర్గ కాలంలో స్థాపించ బడింది. కొన్నివేల సంవత్సరాల నుండి వ్యాపకంలోవున్న దేశీయవైద్య విధానాన్ని ఆధునిక వైద్యవిద్యతో సమన్వయ పరచడమే యీస్కూలు నిర్మాతల ఆశయం. అందుకొరకు దేశంలో ప్రచారంలోవున్న ఆయుర్వేదం, యునానీ, సిద్ధవైద్యవిధానాలకు సంబంధించిన మూడు శాఖలలోను యీస్కూలులో అనేక వందలమంది వైద్యవిద్య అభ్యసించారు. ప్రాక్టీసు చేస్తున్నారు కూడ.

సవతితల్లి ప్రేమ

కాని మొదటినుంచి ప్రభుత్వ వైద్యశాఖవారికి యల్. ఐ. ఎం. స్కూలు అంటే ఒకవిధంగా సవతితల్లి ప్రేమ. స్కూలును, దానికి అనుబంధంగా వున్న ఆస్పత్రిని, అభివృద్ధిచేసి విద్యార్థులకు వైద్యవిద్యలో పరిపూర్ణమైన శిక్షణ యివ్వడానికి ఏర్పాట్లు చేయలేదు. హాస్పిటలులో విద్యార్థులకు తరిఫీదు యివ్వడానికి తగినంత సౌకర్యాలు లేవు. సమగ్రమైన పరిజ్ఞానంగల అధ్యాపకులను నియమించ లేదు.

దీనికంతకు కారణం ప్రభుత్వ వైద్యశాఖ అలోపతి (పాశ్చాత్య) డాక్టర్లచేతిలో వుంది. వారికి దేశీయవైద్యమంటే నమ్మకంలేదు. దేశీయవైద్యం కూడ కొన్నివేల సంవత్సరాల అనుభవంనుంచి ఏర్పడిందని వారు గుర్తించుట లేదు. అందుచేవారు ఆధునిక సైన్సును ఉపయోగించి పరిశోధనలు జరుపలేదు. సోవియట్‌యూనియన్‌లో చేసినట్లుగా దేశీయఔషధాలను ఆధునిక డాక్టర్ల మందుల సంచి కట్టలోకి తీసుకురావడానికి ప్రయత్నించలేదు దీనిఫలితంగా యల్.ఐ.ఎం. స్కూలులో చదువు "నానాటికి తీసికట్టు నాగంభొట్లు" మాదిరి అయింది.

డాక్టర్ల గతి

ఈ స్కూలులో ఉత్తీర్ణులైన డాక్టర్లను ఇండియన్ మెడికల్ కౌన్సిల్ గుర్తించడం లేదు. ఇతర రాష్ట్రాలలో ప్రభుత్వాలు వీరిని డాక్టర్లుగా గుర్తించడం లేదు. మద్రాసు రాష్ట్రంలో లోకల్‌బోర్డులలో తప్ప యల్. ఐ. ఎం. డాక్టర్లకు మరెచటా ఉద్యోగాల ప్రాప్తిలేదు. సైన్యంలోకి డాక్టర్లుగా తీసికోవడం లేదు. చివరకు కాంపౌండరుగా నైతం తీసికోడానికి ప్రత్యేకంగా కాంపౌండరు పరీక్ష ప్యాసవాలంటున్నారు.

కాంగ్రెసు మంత్రివర్గం రోజులలో వైద్యశాఖామాత్యులైన డాక్టరు రాజన్‌గారు యీ స్కూలును బాగుచేయడానికి ఎట్టిప్రయత్నం చేయకపోగా, గోరుచుట్టుమీద రోకటి పోటవేట్టు వీరుకూడ యీ స్కూలుపై దెబ్బ కొట్టారు. అలోపతి డాక్టరైన రాజన్‌గారు యీ స్కూలు చదువు ఎందుకూ పనికిరాదని యీసడించి వూరుకున్నారు.

విద్యార్థుల అసంతృప్తి

ఇంత గందరగోళంగా వున్నపుడు యల్.ఐ.ఎం. స్కూలులోచదివే విద్యార్థులలో అసంతృప్తి పెచ్చుపెరిగిందంటే ఆశ్చర్యం ఏముంది? ఆ అసంతృప్తి ఈనాడువచ్చింది కాదు. సంవత్సరాల తరబడివుంది. విద్యార్థులు ప్రభుత్వానికి పంపిన మెమొరాండాలలో తమకున్న కష్టనిష్ఠురాలను గురించి చెప్పుకున్నారు. ఆస్పత్రిని అభివృద్ధి చేయాలని కోరారు. శిక్షణసౌకర్యాలను బాగుచేయాలని కోరారు. దేశీయవైద్యంలో వుత్తమ సేవ చెయ్యడానికి కావలసిన అవకాశాలు కలిగించమని ఆందోళన చేశారు.

విద్యార్థులుకోరిన యీకోర్కెలన్నీ న్యాయమైనవే. వీటిని విద్యార్థులేగాక యల్.ఐ.ఎం. స్కూలు అధ్యాపకులు, డాక్టర్లుకూడ బలపరుస్తారు. సక్రమ ఆందోళనద్వారా వీటి సాఫల్యంకొరకు ప్రభుత్వంపై ఒత్తిడి తేవడానికి కృషిచేస్తే విద్యార్థులపట్ల వారందరిఅండవుండేది. కాని విద్యార్థులు ఆందోళనతో ఆగక, సమ్మెకు పూనుకున్నారు. ఈనెల 8 వ తేదీనుంచి విద్యార్థులు స్కూలుకువెళ్ళడం మానివేశారు.

ప్రభుత్వం వెంటనే యిది సాకుగా తీసికుంది. విద్యార్థుల డిమాండులు ఆలోచించబడుతున్నాయంది. సమ్మె మానివేసి విద్యార్థులు సోమవారం (11 వ తేదీ) స్కూలుకు హాజరు కాకపోతే స్కూలునే మూసివేస్తామని ప్రిన్సిపాల్‌ద్వారా ప్రకటించింది. విద్యాసౌకర్యాలను బాగుచెయ్యాలని విద్యార్థులు కోరారు. కాని స్కూలే బందయ్యేస్థితి ఏర్పడింది.

ఈస్థితిలోనైనా విద్యార్థులను నడిపేవారు జాగ్రత్తగా ఆలోచించవలసింది. స్కూలును మూసివేయడమంటే, పూర్తిగా నష్టపడేది విద్యార్థులేననేది గమనించవలసింది.

ఈ విషయమై భిషగ్రత్న డాక్టరు ఆచంట లక్ష్మీపతిగారు చక్కగా విశదపరచారు. తమ ప్రకటనలో వారిలా అన్నారు: "....ఇంతవరకు చేసిన సమ్మెద్వారా విద్యార్థులు తమకు జరుగుతున్న అన్యాయాన్ని బహిరంగపరచారు. ఇంతటితో చాలించి. ఒక ఒడంబడికకు రావడం మంచిది. ఎందువల్లనంటే, దీనివల్ల నష్టంపొందేది విద్యార్థులే"

(12 వ తేదీ "ఆంధ్రప్రభ" నుంచి)

ప్రభుత్వ దాడి

కాని సోమవారంనాడు విద్యార్థులు సమ్మె మానలేదు. ప్రభుత్వం వెంటనే తిరిగి ఉత్తరువులు వచ్చేవరకు యల్. ఐ. ఎం. స్కూలును మూసివేస్తున్నామని ప్రకటించింది. ప్రిన్సిపాలు విద్యార్థులకు జరిమానాలు విధించారు. కొందరిని హాస్టలునుంచి లేచి పొమ్మన్నారు. బడుగుడు (మిగతా 4 వ కాలం)

రేపల్లెతాలూకాలో మలేరియా విజృంభణ

రేపల్లెతాలూకాలో, భోగాయపాలెం, కూచినపూడి, రేపల్లెటౌన్ ఏరియాలలో విపరీతంగా మలేరియా విజృంభించింది. ఇప్పటికి దాదాపు 21 గ్రామాలలో తీవ్రంగా వ్యాపించింది. ఒక్క నల్లూరిపాలెంలోనే 400 మంది ఈ జ్వరంతో మంచం పట్టారు. కొన్ని గ్రామాలలో మలేరియాజ్వరం రాని మనిషిలేడంటే ఆశ్చర్యపడ నవసరంలేదు; క్రిందటి సంవత్సరం బాధపడ్డవారికి ఈ సంవత్సరం గ్రహణికూడా వెంటబడి ప్రాణాలు తీయుచున్నది. ప్రతిరోజు ఏదోఒక గ్రామంలో ఒకరిద్దరు చనిపోవుచున్నారని వార్తలు వస్తున్నాయి.

ప్రయివేటు డాక్టర్లకు వచ్చే క్వినైన్ డబ్బున్నవారికే అందుతోంది. హాస్పిటల్సు రాత్రింబవళ్ళు పనిచేస్తున్నాయి. క్వినైన్ ఏమాత్రం చాలటంలేదని డాక్టర్లు కూడా నిస్సహాయతను తెల్పుచున్నారు. ఈ పరిస్థితులు బీదరైతుల, కూలీల ప్రాణాలను తోడేస్తున్నాయి.

క్రిందటి సంవత్సరం తాలూకా యువజన సంఘం తరఫున క్వినైన్ తెప్పించి చౌకగా ప్రజలకు అందజేశారు. అంతేగాకుండా తాలూకా హెల్తుఇన్స్‌పెక్టరుగారి వద్దనుండి క్వినైన్‌బిళ్ళలను తీసుకొని గ్రామాలలో ఇంటింటికి తిరిగి పంచారు. కాని ఈసంవత్సరం స్థానిక హెల్తు ఇన్స్‌పెక్టరుగారు యువకుల సహకారాన్ని నిరాకరిస్తున్నారు.

ఈ తాలూకా మలేరియా ప్రాంతంగా ప్రకటింపబడ్డప్పటికి తగినంత క్వినైన్ సప్లయి కావటంలేదు. ఆరోగ్యశాఖవారు కూడ క్వినైన్ అతిగినంత రావటంలేదని చెప్పుచున్నారు. పైగా రోగులకు రెగ్యులర్‌గా సప్లయిలేనందువల్ల జ్వరం తిరగబెట్టి ప్రమాదకరమైన రూపందాల్చటం సామాన్యం అవుతోంది.

కాబట్టి ఈపరిస్థితులలో ప్రభుత్వం వెంటనే ఈ దిగువచర్యలు తీసికొంటేగాని ప్రజలు కాపాడబడరు.

1. క్వినైన్ విరివిగాను, రెగ్యులర్‌గాను సప్లయిచెయ్యాలి.

2. సప్లయి చేయబడిన క్వినైన్ ఎవరో తమకు తోచిన వ్యక్తులద్వారా కాకుండా ప్రజాసంస్థల సహకారంతో, స్పెషల్‌స్టాఫును వేసి పంపకం చేయించాలి.

3. క్వినైన్ బిళ్ళలేకాకుండా, క్వినైన్ సూదిమందులు కూడా సప్లయిచేసి తను స్పెషల్ స్టాఫ్‌ద్వారా ప్రమాదకరమైన కేసులలో ఇన్‌జెక్షన్లు ఇప్పించాలి.

4. పంచాయితీ బోర్డులన్నింటికీ స్థానిక అవసరాలను బట్టి క్వినైన్ కోటాలు యివ్వాలి.

5. ఆరోగ్యసూత్రాలపై ఆరోగ్యశాఖవారు వెంటనే అన్నిగ్రామాలలోను ప్రచారానికి పూనుకోవాలి.

ప్రజాసంస్థలు, ప్రజలు, పెద్దలందరూ కలిసి గ్రామగ్రామాన ప్రజా ఆరోగ్యకమిటీలు స్థాపించి, ప్రభుత్వంపై మహజర్లు, టెలిగ్రాములద్వారా తీవ్రమైన ఒత్తిడి తెచ్చుటకును, సప్లయిఅయిన మందు సక్రమంగా ప్రజలకు అందజేయుటకునుతీవ్రకృషికి పూనుకోవాలని యుంది.

(2 వ కాలం తరువాయి) విద్యార్థులకు స్కూలునుంచే స్వస్తిచెపుతూ ఉత్తరువు జారీచేశారు. స్కూలును మూసివేశారు.

ఈ సమయంలో విద్యార్థులు ఏమి చెయ్యాలి? ఇపుడు ప్రతిష్టకు పెనగులాడి, సమ్మెనుకొనసాగించడమంటే యల్.ఐ.ఎం. సంస్థకే ముప్పు వాటిల్లుతుంది. కాబట్టి విద్యార్థులు వెంటనే సమ్మె మానివేయాలి. స్కూలుకు హాజరుకావడానికి తమ సంసిద్ధతను తెలుపుతూ ప్రకటన చేయాలి. జరిమానాలు, వెళ్ళగొట్టడాలు వగైరా శిక్షలనుగురించి ప్రిన్సిపాలుపై పెద్దలద్వారా ఒత్తిడి తేవాలి.

రాష్ట్ర యల్. ఐ. ఎం. సంఘంవారు ప్రభుత్వంపై ఒత్తిడితెచ్చి, వెంటనే స్కూలును తెరిపించడానికి ప్రయత్నించాలి. దేశీయ వైద్యం యెడల సానుభూతి కలిగిన డాక్టర్ అరండేలు, డాక్టర్ ఆచంట లక్ష్మీపతి, డాక్టర్ సుబ్బరాయన్ వగైరా పెద్దల సహాయంతో యిందుకు కృషిచేయాలి విద్యార్థుల చదువు పాడవకుండా కాపాడటానికి, విద్యాసంస్థను రక్షించడానికి, నేడు యిదొకటే మార్గం. ఇలా చేస్తేనే విద్యార్థులు యితర కష్టనిష్ఠూరాలను తొలగించుకోగలుగుతారు.

దసరాపాట

(బాలబాలికలకు)

జైగాంధి జిన్నాకు జేజేలుగొడుతూ
బాలబాలికలార పండగొచ్చిందీ॥ జై॥

భావిపౌరులమైన బాలురంతాను
స్వాతంత్ర్యకాంతి బలివృద్ధులనుచాటే
బాలసంఘపుజండాక్రింద సలవాలీ
హెచ్చుతగ్గులులేని స్వచ్ఛమైనట్టి
భ్రాతృత్వమునునేర్పు బాలసంఘముచో
చేరి మనమంతాను శ్రద్ధగాచదివి
జ్ఞానమూర్తించి విజ్ఞానవేత్తలుగ
ఆటలతో పాటలతో అరిలేరాలి॥ జై॥

వీధివీధులలోన యిల్లిల్లుతిరిగి
బెంగాలు బీహారు రాయలసీమ
పల్నాడు విశాఖ పలుతావులందు
కరువులతో వరదలతో దొంగమార్కెటులో
దొక్కసిందాతించి కట్టుపుట్టాలు
దొరకకా యమబాధ పొందుచున్నారు
మనతల్లి దండ్రులను ఒప్పించిమనము
కంట్రోలురేటుకే మిగులుధాన్యాన్ని
అమ్మించి సోదరుల రక్షించుదాము॥ జై॥

మనబోటి బిడ్డలను మట్టిపాల్జేసి
అక్కలను అమ్మలను అవమానపరచి
ప్రజలరక్తము ద్రాగు పరమనీచుండు
దేశాలమ్రింగిన దుష్టుడౌ హిట్లర్
పడమరా హిట్లరూ తూర్పునా టోజో
భూలోక రాక్షసుల పూడ్చిపెడదాము॥ జై॥

దేశదేశాలలో స్వాతంత్ర్యజ్వాల
అలముకొనుచున్నదీ తెలుసుకోరన్నా
రెండువందల ఏండ్ల నుండి మనమంతా
పాదుదాస్యములోన మ్రగ్గుచున్నాము
ఐకమత్యము మనలో లేనందువల్లా
పగవారు మనపైకి దూకుచున్నారు
అందుకని యీనాడు ఆనందముగను
గాంధి జిన్నా తాతలు కలుసుకున్నారు.
కాంగ్రెసూ లీగులూ కలసినాయంటే
భారతమాతను ఎవడు బంధించగలడు
జై భారతాంబకు జై మాతృభూమికి
జైగాంధి జిన్నాకు జేజేలు గొడదాం॥ జై॥

— టి. వి. కృష్ణ

నాగార్జునకొండ మ్యూజియాన్ని ప్రభుత్వం ఎత్తివేస్తుందా?

[ప్రాచీనాంధ్ర శిల్పకళకు చిహ్నం నాగార్జునకొండ. ప్రాచీనచరిత్రను తెలిపే అమరావతి వగైరా ప్రదేశాలనుండి అనేక శిల్పశేషాలను యిదివరకే ప్రభుత్వం లండను, మద్రాసు వగైరా మ్యూజియాలకు తీసుకుపోయింది. నాగార్జునకొండవద్ద మాత్రం చిన్న మ్యూజియంపెట్టి శిల్పశేషాలను కాపాడుతోంది. కాని ఇండియా ప్రభుత్వ పరిశోధనశాల యీ మ్యూజియాన్ని ఎత్తివేసి శిల్పశేషాలను మద్రాసు, కలకత్తా మ్యూజియాలకు తీసుకుపోవాలని నిర్ణయించిందనే యీవార్త మాకు తెలుస్తోంది. ఆంధ్రదేశ చరిత్రకు నిధివంటిదైన నాగార్జునకొండయొక్క శిల్పాలను అచటినుండి తీసుకుపోవడం అన్యాయం. ఆంధ్రపరిశోధకులు, విశ్వవిద్యాలయంవారు, ఆంధ్రమహాసభవారు, మేధావులు ప్రజలంతా ఆందోళనచేసి యీవిధంగా జరగకుండా చూడాలి. సోదర పత్రికలుకూడ దీని విషయమై ఆందోళన చేస్తారని ఆశింసుతాము. సం.]

"ఈ నమున్నత శాశ భూమీరుహమ్ము
లే యుగాలనాటివో, యిచటనిలచి,
నిశ్చలాస్పందమ్ముకుళిత నేత్రములను
తలచుచున్న వియుగయుగమ్ములచరిత్ర."

అని కవికుమారుడు శాటిచెల్లను వర్ణించాడు. ఇదే నాగార్జునకొండ వసంగాచేస్తే, చక్కగా వుంటుంది. 1800 ఏండ్లనాటి మన ఆంధ్రుల చరిత్రను నాగార్జునకొండ జ్ఞప్తికి తెస్తుంది. శాలివాహనశకంనాటి ఆంధ్రులనుంచి పల్లవాంధ్రుల వరకు మన చరిత్రలో ఒక అఖాతం ఏర్పడ్డది. ఆ మధ్యకాలంలోని చరిత్రకు ఆధారం నాగార్జునకొండ ఒక్కటే.

నాగార్జునుడు

ఆంధ్ర చరిత్రలో బుద్ధ నాగార్జునుడనీ సిద్ధ నాగార్జునుడనీ యిద్దరు మహావ్యక్తులున్నారు. ఇద్దరు బౌద్ధులే. బుద్ధనాగార్జునుడివల్ల నాగార్జునకొండకాపేరు వచ్చింది. నాగార్జునుడు మహా పండితుడు. బౌద్ధమతంలో మహాయాన పీఠానికి మూలపురుషుడు. హీనయానపీఠం సన్యాసిస్తేనే నిర్వాణం కలదంటుంది. మహాయానపీఠం, ప్రజలు తమ నిత్య జీవనంలో అహింసాసాధువర్తనులై గడిపితే నిర్వాణం పొందగలరంటుంది. ఈ సిద్ధాంతంతో బౌద్ధమతం సుగమమై ప్రజలందరి అందుబాటులోకి వచ్చింది.

నాగార్జునాచార్యుడు బౌద్ధసన్యాసిమాత్రమే గాదు. ప్రకృతి శాస్త్రజ్ఞుడూ, వైద్యశాస్త్రజ్ఞుడూనూ. పాదరసాన్నీ, వజ్రాన్నీ పుటం పెట్టడం, గంధకాన్నీ పాదరసాన్నీ గలిపి మేళవించడం, ఇనుమునుకాల్చి సిందూరం చేయడం కనిపెట్టాడు. రసరత్నాకరమని యొక రసాయన గ్రంధం వ్రాశాడు. అతని అసంఖ్యాక రచనలలో చైనా పండితుల కర్మమా అంటూ ఇవవైనాలుగు మాత్రం మిగిలాయి. అన్నీ సంస్కృతంలో రాశాడు.

నాగార్జునుడు క్రీ. శ. 130—200 మధ్య వర్ధిల్లాడు. ఈ మధ్యకాలంలో ఏలిన ధాన్యకటక (ధరణికోట) శాలివాహన చక్రవర్తులలో నెవరో శ్రీపర్వతంపైన బౌద్ధారామాన్ని యీయనకొరకు నిర్మించారు. నాగార్జునుడా ఆలయంలో నివసించాడు. అతనికాలంలో ఆ బౌద్ధారామం మత విద్యా విజ్ఞానాలకూ, రసాయన శాస్త్ర పరిశోధనలకూ నిలయమైంది. ప్రపంచ బౌద్ధులకందరికీ యాత్రాస్థలమైంది.

ఆంధ్రుల చరిత్ర పరిశోధనకు కొత్తసామాగ్రి

శాతవాహనులవెంటనే వారి రాజ్యానికి వచ్చిందెవరు? ఆంధ్రులస్థితి ఎలా ఉండేది? అనే విషయం వేకువ తనుచీకటిలో అస్పష్టంగా ఉండిపోయింది. ఇటీవల పరిశోధనలో నాగార్జునకొండ బయటికి వచ్చింది. క్రీ. శ. 200 మొదలు 250 వరకూ 50 ఏళ్ల ఆంధ్రులచరిత్ర రమ్యమైన ఉషఃకాంతులతో దిక్కులను రంజింపజేసింది.

నాగార్జునకొండ గుంటూరుజిల్లా పల్నాడులో కృష్ణాతీరాన ఉన్నది అక్కడ 1 మహాచైత్యం, 4 చైత్యాలు, 1 మహావిహారం, 5 విహారాలు, 9 స్తూపాలు, మరి అనేక శిలాశాసనాలు, చెక్కడాలు బయల్పడ్డాయి. కొండకు పడమటిదిక్కున కృష్ణానదికి వార్పు ఉన్నట్లు బయటపడ్డది.

ఇవి తెలిపిన చరిత్రేమిటి?

సామ్రాజ్య శాతవాహనుల సామంతులూ రక్తసంబధీకులైన ఇక్ష్వాకు చక్రవర్తులు ముగ్గురు క్రీ. శ 200 నుంచీ 252 వరకూ ఆంధ్రసామ్రాజ్యాన్ని పాలించారు. అశోకుని కాలంలో బౌద్ధమతం అవలంబించిన శాతవాహనుచక్రవర్తుల తర్వాత వచ్చిన, మొదటి యిక్ష్వాకుచక్రవర్తి శాంతమూలుడు పూర్తిగా వైదికమతాన్ని స్వీకరించాడు; బౌద్ధమతాన్ని ద్వేషించాడు. బౌద్ధమతాన్నెదుర్కోటానికి వేలాది బ్రాహ్మణులను యితరరాజ్యాలనుండి రప్పించి, వాళ్ళకు భూమిని, ధాన్యాన్ని, పశువులనూ విరివిగా దానం చేశాడు.

తరువాత అతనికొడుకు వీర పురుషదత్తు బౌద్ధమతాన్ని స్వీకరించాడు. వైదికమతాన్ని నిరశించాడు. ఈతని మేనత్త శాంతిశ్రీ నాగార్జునుడు నివసించిన మహాచైత్యాన్ని పునరుద్ధరించింది రాణివానష్ఠిలంకా ఈమహాచైత్యానం చుట్టూ విహారాలనూ, ఆయక స్తంభాలనూ, ఆరామాలనూ, సభామంటపాలనూనిర్మించారు. నాగార్జున కొండతిరిగీ అసంఖ్యాకులైన బౌద్ధ సన్యాసుల కాలవట్టయింది. బోధిశ్రీ అనే సామాన్యభక్తురాలు హిందూ దేశమన్ని మూలలా బౌద్ధారామాలను నిర్మించింది. వీటిని ప్రజా శ్రేయస్సుకొరకు బౌద్ధుల కంకితం చేసింది. వీరపురుషదత్త చక్రవర్తి మునలితనాన తన కొడుకు బాహు బలవంత మూలుడికి పట్టాభిషేకము చేశాడు. ఇతడు గూడ బౌద్ధుడే.

ప్రజాజీవనం - సంస్కృతి

బౌద్ధమతం ప్రజాసామాన్యంకొరకేర్పడ్డది. వెనుకబడియున్న ప్రజాసామాన్యంకొరకూ, స్త్రీలకొరకూ రచనలను ప్రాకృతంలో సాగించింది. వైదికమతం ప్రజాసామాన్యాన్ని తోసిరాజన్నది. కాని అణచిపెట్టబడియున్న స్త్రీలూ, ప్రజలూ బౌద్ధమతాన్ని అభిమానించారు. మాతృభాషయైన పైశాచిని వదిలిపెట్టలేదు. ప్రాకృతానికి ప్రాముఖ్యస్థానం వచ్చింది. ప్రజలు మాట్లాడే భాషయైన పైశాచి క్రమేణా బ్రాహ్మ, మాగధి, పాళి మొదలైన ప్రాకృతభాషలతోటీ, సంస్కృతంతోటీ సంపర్కం పొందడం, శాసనాల్లోకీ, రచనల్లోకీ ప్రవేశించడం ప్రారంభమైంది. ఈ మిశ్రమమే ఆంధ్రభాషయని పిలువబడ్డది.

చాలాభూమి సాగులోకి తేబడ్డది. కృష్ణా దక్షిణతీరం వెంట పోకలు పండించేవారు. కృష్ణానదినిగుండా యితర దేశాలతో ఓడ వ్యాపారముండేది అద్భుతమైన శిల్పచాతుర్యంగల శిల్పులనేకులుండేవారు.

మన బంగారు పాతర

ఈ చరిత్రఅంతా యాభైయేళ్లల్లో జరిగింది. ప్రజలు తమ జీవనాన్నీ, తమ భాషనూ, సంస్కృతినీ, వైదికమత ప్రాబల్యంక్రింద నలిగి నశించకుండా కాపాడుకొన్న వీర చరిత్ర. అది చాళుక్యయుగంనాటికి సర్వాంగసుందరమైన తెలుగుభాషకు విత్తనాలు చల్లిన యుగయుగాలనాటి చరిత్రఅది. దేశదేశాలకూ విజ్ఞానప్రచారం చేసిన యుగయుగాలనాటి ఉజ్వలచరిత్రఅది. తెలుగులకృషి సంస్కృతీ వస్త్రాలను పండించి నింపిన బంగారు పాతర నాగార్జునకొండ. తెలుగు చరిత్ర ఉదయ సంజలతో దిక్కులనుప్రకాశింపజేసినదీకొండ శిఖరమునందే నాగార్జునకొండ మనయాంధ్ర జాతికి పూర్వార్జితమైన ఆస్తి. దాని ఆధారంతో మనం యింతవాళ్లమైనాం. ఇలాంటి పూర్వార్జితాన్ని చూచుకుని మనంగర్వపడాలి. దానిని ప్రాణపదంగా కాపాడుకోవాలి.

— పి. వి. శివయ్య.

కోవూరుతాలూకా రైతుమహాసభ

విచ్ఛిన్నకుల గలభాను ఖండిస్తూ కాంగ్రెసు నాయకుల విజ్ఞప్తి

కోవూరుతాలూకా (నెల్లూరు) రైతుమహాసభ 11—9—44 తేదీ శ్రీ దుప్పూరు బలరామిరెడ్డి అధ్యక్షత క్రింద లేగుంటపాడులో జరిగింది. 80 గ్రామాలనుంచి 8 వేల పైగా రైతులు వచ్చారు.

సభలో కాంగ్రెసు నాయకులైన శ్రీముత్తరాజగోపాలరావు శ్రీ దుప్పూరు బలరామరెడ్డిగారు ఉపన్యసించారు.

సభను రాజాజనందుకు సంతాపము తెలుపుతూ నెల్లూరుజిల్లా జమీన్ రైతు సంఘ కార్యదర్శి శ్రీ రావిపాటి మహానందచౌదరి, ప్రముఖ కాంగ్రెసు వాదులగు శ్రీ అనంతెంమ సుబ్బారెడ్డి, శ్రీ మన్నేపల్లి హనుమంతరావు, శ్రీ వేణుంబాక వీరరాఘవరెడ్డి గార్లు పంపిన సందేశాలను చదివారు.

గాంధి-జిన్నా సంప్రదింపులు జయప్రదం కావాలని, బీహారు గుజరాత్ రాష్ట్రాలలోను, విశాఖపట్నం జిల్లాలో ఏర్పడిన, కరువు, వరదలు, అంటువ్యాధులనుండి బాధపడు ప్రజలకు సేవచేస్తూ ప్రజలను రక్షించుటకు; రాజేంద్రప్రసాద్, వల్లభాయ్‌పటేల్, టంగుటూరు ప్రకాశంగార్లను విముదల చేయాలని తీర్మానాలు ఏకగ్రీవంగా ఆమోదింపబడ్డాయి.

ఉపన్యాసాలమధ్యలో నెల్లూరు వెంకట్రామా నాయుడు ముఠాకు చెందిన శ్రీ శివారెడ్డి శేషురెడ్డిగారు మాట్లాడవలెనన్నారు. అందుమీదట అధ్యక్షులు శ్రీ దుప్పూరు బలరామరెడ్డిగారు ఉపన్యాసానికి అవకాశమివ్వగా, వారు ఉపన్యసించలేదు. సభపూర్తియైన పిమ్మట కళాప్రదర్శనాలు ప్రారంభమయాయి.

కళా ప్రదర్శనాల మధ్యలో శ్రీ శివారెడ్డి శేషురెడ్డిగారు కొంతమంది గుంటపాడు గ్రామస్థులసహాయంతో తానుఉపన్యసించాలని గలభా ప్రారంభించారు. అందుమీదట ముత్తరాజు గోపాలరావుగారు కళాప్రదర్శనాలు నిలిపించి శేషురెడ్డిగారికి మాట్లాడుటకు అవకాశ మిప్పించారు. శేషురెడ్డిగారి ఉపన్యాసం అయిపోగానే మరల కళాప్రదర్శనాలు ప్రారంభమయాయి. కాని కొంత సేపటిలోనే మరల రెడ్డిగారు తన బృందంతోలేచి, గలభా చేయదలచారు. అందుచేత కళాప్రదర్శనాలు నిలిపివేయబడ్డాయి.

ఈ సంఘటననుగూర్చి దుప్పూరు బలరామరెడ్డి (మాజీ జిల్లాకాంగ్రెసు కార్యదర్శి) ముత్తరాజా గోపాలరావు (నెల్లూరు టౌన్ కాంగ్రెసు అధ్యక్షులు) గారలు యీక్రింది ప్రకటన గావిస్తున్నారు:

"ఏ పార్టీవారైనా, యే సంఘంవారైనా తమ కార్యక్రమాన్ని బహిరంగంగా చెప్పుకొనుటకు గల వాక్ స్వాతంత్ర్యాన్ని భగ్నపరిచే యిట్టి విచ్ఛిన్న కారులయొక్క చర్యలను తీవ్రంగా ఖండించి, కాంగ్రెసు గౌరవాన్ని నిలబెట్టవలెననియు, ఇకమీద వీరి ఆటలు సాగకుండా చేయాలనియు ప్రజలందరినీ కోరుచున్నాము".

ఉమ్మడిసొమ్ము - సద్వినియోగం

అమృతలూరు (గుంటూరు) వ్యవసాయ కూలీ పల్లెదగ్గర ఐదారు చిల్లరకొట్లున్నాయి. పల్లెలోని కూలీలు - ఒక దుకాణదారుతో - 'సక్రమమైనరేట్లకు సరకులమ్మేట్లు, సొలకు కొంతభాగం పల్లెకు యిచ్చేట్లు' గత రెండు సంవత్సరాలూ కంట్రాక్టు వ్రాసుకొని అతని దగ్గరే అందరూ సరుకులు కొనుక్కొనేవాళ్ళు. ఇలా వారికి రు 150-0-0 లు దుకాణదారుని వల్ల లభించింది. ఆ మొత్తాన్ని ఏ విధంగానూ దుర్వినియోగం చేయకుండా, పల్లెలో గ్రామ వ్యవసాయ కూలీ సంఘ ఆఫీసు ఏర్పరచుకోడానికిగాను స్థలంకొని ఇల్లు కట్టుకోడానికి తీర్మానించుకొన్నారు. ఇప్పుడువారు స్థలంకొని ఆఫీసుకోసం యిల్లు కట్టుకొంటున్నారు. మిగతా ఖర్చులకుగాను ఒకయకరం బంజరు ఉమ్మడి సాగుచేశారు. ఇది తదితర వ్యవసాయ కూలీ పల్లెలు అనుసరింపదగిన విషయం.

★ యుద్ధసమీక్ష

రుమేనియాలో ప్రజాస్వామ్యశక్తులకు సహాయం

జర్మనీ సరిగడ్డమీదనే యుద్ధం ముంచుకొచ్చింది. జర్మనీని అన్ని ప్రక్కలా మిత్రసైన్యాలు క్రమ్ముకొస్తున్నాయి. ఫ్రాన్సు, బెల్జియం, లగ్జెంబర్గులనుండి బయలుదేరిన మిత్రసైన్యాలు జర్మను సరిహద్దును దాటాయి. కొన్ని పట్టణాలను వశపరుచుకొన్నాయి. హాలండ్‌లో విమానాల ద్వారా దింపబడిన మిత్రసేనలు జర్మన్లతో హోరాహోరి పోరాడుతున్నారు.

అటు తూర్పునకూడ సోవియట్ జర్మనీపై అంతిమయుద్ధానికి సన్నాహమౌతోంది. అప్పుడే లాట్వియా నుంచి 40 డివిజన్లతోకొత్తదాడిప్రారంభించింది. తూర్పుప్రష్యా గుమ్మంలో యుద్ధ సంరంభం తగ్గలేదు. ఇంక వార్సా తూర్పుభాగం 'ప్రాగా' రెడ్‌ఆర్మీచేతిక్కింది. రుమేనియన్ సైన్యాలతో గలసి హంగరీపై యుద్ధాన్ని సాగిస్తోంది రెడ్‌ఆర్మీ. జకొస్లోవేకియాలోకాలుపెట్టింది. యుగోస్లావియాలోవిమార్షల్ టిటో సైన్యాలతో చేతులుగలిపి, దక్షిణ బాల్కన్ దేశాలలోని 2లక్షల జర్మనుసైన్యాలను దిగ్బంధంచేసింది. ఈరెండులక్షం మందిని ఎటూ పోకుండా 'టిటో', యుగోస్లావియాలోని రహదారులన్నీ నరికివేశాడు. ఈ విధంగా మిత్రసైన్యాలన్ని ప్రక్కలనుండి జర్మనీని చుట్టుముట్టుతున్నాయి. దెబ్బతిన్న పులిలా, జర్మను గుహలోదాగి తీవ్రప్రతిఘటన సాగించ జూస్తున్నాడు హిట్లరు.

నూతన ప్రపంచం

హిట్లరు పరాజయాలతో ఆక్రమిత యూరప్‌కు పునర్జన్మ లభించుతోంది. నాజీఆక్రమిత ప్రజలు నూతన ప్రజాస్వామ్య ప్రపంచానికి, ప్రారంభోత్సవం కావించుతున్నారు.

బాల్కను దేశాలంటే, రుమేనియా, బల్గేరియా, గ్రీసు, యుగోస్లావియాలు, గత 25 ఏండ్లలోను ఈదేశాలచరిత్ర అనేక గందరగోళాలతో నిండివుంది. నీతి నియమాలు లేని పాలకులు, భూస్వాముల పెట్టుబడిదారుల ఏజంట్లయిన రాజకీయవేత్తల ముఠాలు, ఈదేశాలను పాలించారు. పూర్వం బ్రిటిష్ పెట్టుబడిదారుల చేతిలోను, ఆతర్వాతజర్మను పెట్టుబడిదారుల చేతుల్లోను కీలుబొమ్మల్లాగా ఈప్రభుత్వాలుండేవి. బ్రిటిషు, జర్మన్ అభివృద్ధి నిరోధకులందరూ వీటిని పోషించుటపైకే ఉనికొల్పారు. ఇలా ఒక్కసోవియటుకూ, తమ తమ దేశాలలోని ప్రజలకూ వ్యతిరేకంగా ఉండటమేగాదు. తమలోతాము కొట్టుకుచచ్చేవి ఒకళ్లదేశంలో భాగాన్ని మరొకళ్లు కాజేసేవాళ్ళు. అలాంటి దేశాల రూపురేఖలన్నీ ఈనాడు తిరిగి వ్రాయబడుతున్నాయి.

సోవియటుతోటిస్నేహం, ప్రజాస్వామ్యపక్షాలకు బలమూ అధికారమూ, వృద్ధిఅవుతున్నాయి. ఈవిధంగా ఒక నూతన యూరపు సృష్టింపబడుతోంది.

రుమేనియా చరిత్ర

ఉదాహరణకు రుమేనియాను తీసికొందాం. గత యుద్ధానంతరం, రుమేనియా అనేక దురాక్రమణలు గావించింది, అస్ట్రియానుండి బుకోవినాను, హంగరీనుండి ట్రాన్సిల్వేనియాను, రష్యానుండి బెస్సరేబియాను లాక్కొంది. అంతకు పూర్వమే ఎన్నడో బల్గేరియానుండి దక్షిణ డోబ్రుజాను లాక్కొంది.

నీతినియమ రహితులయిన పరిపాలకుల చేతులలో రుమేనియా ప్రజలు నల్గిపోతుండేవారు.

ప్రస్తుత యుద్ధానికిపూర్వమే, 1939 ఏప్రిల్‌లో బ్రిటిషు-ఫ్రెంచిదేశాలు తమ పలుకుబడినుండి విడిపోకుండా ఉండాలనే ఉద్దేశ్యంతో, రుమేనియాకు ఒకగ్యారంటీ యిచ్చాయి. రుమేనియాపై ఎవరైనా యుద్ధంచేస్తే, తాము సహాయం చేస్తామన్నాయి. సెప్టెంబరులో యుద్ధం ప్రారంభమయింది. వరుస వరుసనే ఒక్కొక్కదేశం నాజీమారణ యంత్రం క్రింద నలిగిపోజొచ్చాయి. నాజీల పాలిటినుండి బైలోరష్యాను, పశ్చిమయుక్రేయన్‌ను (ఇవి ఇదివరకు పోలండుచే ఆక్రమించుకొనబడినాయి) సోవియట్ రక్షించుకొంది. అలాగే 1940 జూన్‌లో తమ ప్రాంతాలయిన ఉత్తర బుకోవినాను, బెస్సరేబియాను సోవియట్, రుమేనియానుండి విముక్తి గావించింది.

ఫాసిస్టు పరిపాలన

నాజీలు విజయం పొందుతున్నారు, ఇక తమయజమానుల్నికూడ మార్చుకొందామని పాలకవర్గం నిశ్చయించింది. 1940 జులైలో బ్రిటను ఫ్రాంసుల హామీని వదులుకొంది. 1940 అగస్టు నెలాఖరులో జర్మనీ-ఇటలీ ఫాసిస్టుప్రతినిధుల సమావేశమై, ట్రాన్సిల్వేనియాలో చాలభాగం హంగరీకి ఇప్పించారు దానినే "వియాన్నా ఒడంబడిక"అని పిలిచారు. అయినా రుమేనియా, ఫేసిస్టులవైపుకే మ్రొగ్గసాగింది. 1940 సెప్టెంబరు 6వ తేదీన కెరోల్‌రాజు రాజ్యపదవీత్యాగం చేశాడు. ఫేసిస్టు ఆంటోనెస్కూ అధికారం స్వీకరించాడు. ఆనాటినుండి ఒక్క ఫేసిస్టుపార్టీ తప్ప తక్కిన పార్టీలన్నీ రద్దు చేయబడినాయి. 1940 నవంబరులో అక్షరాజ్య కూటమిలో రుమేనియాకూడ కలిసింది.

సోవియట్ పై జర్మనీ హఠాత్తుగా దాడిసల్పగానే రుమేనియాకూడ సోవియట్‌పై యుద్ధం ప్రకటించింది. స్టాలిన్‌గ్రాడ్ యుద్ధంలోను, ఒడెస్సా, యుక్రెన్ యుద్ధాలలో విపరీత నష్టాలకు గురి అయింది.

సోవియట్ పురోగమనంతో రుమేనియాలోని ప్రజాస్వామ్య పక్షాలు బలపడి ఆంటొనెస్కూను త్రోసివేశాయి. ఆంటొనెస్కూ ఖైదీ అయ్యాడు. రుమేనియా సోవియట్‌తో గలసి జర్మనీపై యుద్ధంచేస్తోంది.

మితవాదుల నాటకం

ఇక్కడ ఒక విషయం గమనించాలి, రుమేనియాలో బల్గేరియాలో వలె కార్మికవర్గం బలపడిలేదు. అందుచేతనే 1943 లో ఏర్పడిన "దేశభక్త ఐక్యసంఘటన"లో లిబరల్‌పార్టీని, రైతుపార్టీని కలుపుకోలేకపోయింది 1944 జూన్‌లోగాని పై రెండు పార్టీలు కలవలేదు కారణం ఏమిటి? ఈ రెండు పార్టీల నాయకులు మితవాదులు. సోవియట్ అంటే గిట్టదు. బెస్సరేబియాను బ్రిటిష్ అమెరికాల సహాయంతో రుమేనియాక్రింద నిలబెట్టుకొందామని తలిచారు, కాని లాభంలేకపోయింది. జర్మనీ తమ నుమరింత దోపిడిచేస్తున్న సంగతిగ్రహించాకనే, "దేశభక్త ఐక్యసంఘటన"లో చేరారు. ఇదే "జాతీయ ప్రజాస్వామ్యకూటమి" అని పిలువబడుతోంది.

పైనచెప్పిన "మితవాదులు" ఆంటొనెస్కూ విధానాన్ని అంగీకరించడంలేదు. కాని అతన్ని తొలగించడానికి పోరాడలేదు. ఏవో కుట్రలద్వారా అతన్ని తొలగిద్దామనుకొన్నారు. బ్రిటన్ అమెరికాలలోని అభివృద్ధినిరోధకుల సహాయంతో, తమ సోవియట్ వ్యతిరేకపంథాను వదలుకోకుండానే, అధికారానికి రావాలని చూశారు. అందుకే గతమార్చిలో సోవియటునువదిలిపెట్టి బ్రిటనుఅమెరికాలతో ప్రత్యేకరాయబారాలకుగాను కైరో(ఈజిప్టు)వెళ్ళారు, కాని ఆరాయబారాలు ఫలించలేదు. కారణం? రెడ్ఆర్మీ గుమ్మంలోవుంది. దానిధాటికి ప్రభుత్వం కూలిపోతోంది. ఇంతేగాక మిత్రరాజ్యాలలో విభేదానికి తావులేకుండా టెహరాన్ సమావేశం నిశ్చయించింది. అందుచే సోవియటును సంప్రదించకుండా బ్రిటను అమెరికాలు పైమితవాదులతో సంధిచేసికొనడం అసాధ్యమయింది.

గతనెలలోని సోవియటు పురోగమన ఫలితంగా, ఆంటొనెస్కూ ప్రభుత్వం కూలిపోయింది. కొత్తప్రభుత్వం వచ్చింది. ఈకొత్తప్రభుత్వం, జాతీయ రైతుపక్షం, లిబరల్‌పార్టీ, డెమాక్రటిక్‌పార్టీ, కమ్యూనిస్టుపార్టీలన్నీ కలసిన ఐక్య ప్రభుత్వం.

కమ్యూనిస్టు ప్రతినిధి

ఈ ప్రభుత్వంలో కమ్యూనిస్టు ప్రతినిధి "లుక్రేటివ్ పాట్రాస్కాను" న్యాయశాఖకు రాజ్యాంగశాఖకు మంత్రిఅయ్యాడు. మాస్కోకు వెళ్ళిన శాంతి రాయబారవర్గానికి ఇతడే నాయకత్వం వహించాడు. ఈయన పూర్వంకూడ రుమేనియా పార్లమెంటుకు ప్రతినిధియే. కాని అప్పటి ప్రభుత్వం ఇతనిని ఎన్నడూ అహోరాత్రోపని చేయనీయలేదు. లుక్రేటివ్ జైళ్లలో అనేకఏండ్లుగడిపాడు. రహస్యజీవితం సాగించాడు. ఫాసిస్టు వ్యతిరేకపార్టీలన్నిటినీ "జాతీయ ప్రజాస్వామ్యకూటమి"లోకి లాక్కురావడానికిఎంతో కృషిచేశాడు ఇలాంటివారితోగూడిన ప్రభుత్వంతో రుమేనియాలో ప్రజాస్వామ్యం బలపడి ప్రజలకు జీవనానికి దారితీస్తుందనడానికి సందేహంలేదు.

సమంజసమైన శాంతిషరతులు

మాస్కోలో సోవియట్ ప్రభుత్వం, బ్రిటన్ అమెరికా అంగీకారంతో సూచించిన శాంతి షరతులను రుమేనియా అంగీకరించింది. వాటిలో ముఖ్యమైన వేమిటి?

రుమేనియా మిత్రమండలిలో కలుస్తుంది. జర్మనీ, హంగరీలపై యుద్ధం సాగిస్తుంది. సోవియట్ నాయకత్వాన 12 రుమేనియను డివిజన్లను యుద్ధంలోకి దింపుతుంది. జర్మను హంగేరియను సైనికుల్నందరినీ నిరాయుధులనుజేసి జైల్లో పెడుతుంది. సోవియట్ సైన్యాలకు ప్రయాణసౌకర్యాలను (భూ నౌకా, విమాన) కలుగ చేస్తుంది.

బెస్సరేబియాను, ఉత్తర బుకోవినాను ఇదివరకటి (1940 జూన్ 28) ఒడంబడిక ప్రకారం తిరిగి సోవియటుకు అప్పగించుతుంది. ఖైదీలయిన సోవియట్ ప్రజలను ఇతర మిత్రరాజ్య సైనికులను పంపించివేస్తుంది. వారికి గావలసిన ఆహారం-బట్ట-మందులు వగైరా సప్లయిచేస్తుంది.

ఇంతేగాక, జర్మన్ల- హంగేరియన్ల ఆస్తిపాస్తులు, సైనిక సామాగ్రి, ఆయుధాలు, సోవియట్‌కు అప్పగించాలి. రుమేనియాలోఉన్న మిత్రరాజ్య నౌకలన్నిటినీ సోవియట్‌కు అప్పగించాలి.

సోవియట్‌పైయుద్ధంప్రకటించి నష్టంకల్గించినందుకుగాను 30కోట్లడాలర్లను సోవియట్‌కు రుమేనియాచెల్లించాలి. ఇప్పుడు మిత్రమండలితో రుమేనియాచేరి, జర్మనీ హంగరీలపై యుద్ధంచేస్తోంది కాబట్టి ఈ మొత్తాన్ని ఒక్కసారిగా చెల్లించనక్కరలేదు, 6 ఏండ్లలో వస్తురూపేణ చెల్లించవచ్చు.

రుమేనియా సైనికులు నాశనంచేసిన లేక కొల్లగొట్టిన ఫ్యాక్టరీలు, మ్యూజియంలు, చారిత్రక శిధిలాలు మొదలైనవన్నీ తిరిగి అప్పగించాలి. మోటారుకార్ల ఫ్యాక్టరీ సామాన్లు మొదలైనవి తిరిగి ఈయాలి.

యుద్ధానికి పూర్వం రుమేనియాలో మిత్రరాజ్యాలకున్న లీగల్ హక్కులన్నీ తిరిగి నెలకొల్పాలి. వాటి ఆస్తిపాస్తులు కూడా పూర్తిగా అప్పగించాలి.

ప్రజలపై సైనికులపై క్రూర అత్యాచారాలు గావించిన ఫాసిస్టు క్రూరహంతకులను పట్టియిచ్చుటలో రుమేనియా సాయపడాలి.

ఫాసిస్టు సంస్థలను, హిట్లరు అనుకూల సంస్థలను, సోవియట్ ప్రతికూల సంస్థలను, మిత్రరాజ్య ప్రతికూల సంస్థలను రద్దుచేయాలి.

హంగరీకి ట్రాన్సిల్వేనియాను అప్పగించిన వియన్నా ఒడంబడికను మిత్రరాజ్యాలంగీకరించవు. ట్రాన్సిల్వేనియా పూర్తిగాగాని, కొంతగాని రుమేనియాకు చెందాలని మిత్రరాజ్యాలంగీకరించుతాయి. (వివరాలు ప్రపంచ శాంతి మహాసభలో వస్తాయి.)

ఈ శాంతిషరతులెంతో ఆదర్శవంతంగా ఉన్నాయి. ఫాసిజాన్ని నామరూపరహితంగా చేయుటలో, రుమేనియన్ ప్రజలు తమ పాత్రను ప్రవర్తించడానికి అవకాశం లభించింది; నీతినియమ రహితులైన విదేశ పెట్టుబడిదారీ ముఠాలకు కీలుబొమ్మలై ఇక రుమేనియన్ పాలకవర్గం ఉండదు. సోవియటుతోను, ఫాసిజంనుండి విముక్తిపొంది పునర్జన్మ యెత్తుచున్న బల్గేరియా యుగోస్లావియా మొదలగు సోదర దేశాలతోను, స్నేహంగా మెలుగుతూ, రుమేనియా సుఖజీవనాన్ని పొందబోతున్నది. రుమేనియన్ రైతు యిదివరకువలె ఆంటొనెస్కూవంటి పీడకుల బాధలకు లోనుగానక్కరలేదు.

రుమేనియాకు సోవియటు గావించిన శాంతిషరతులు చూస్తే గత ఏప్రిల్‌లో మాలటోవ్ ప్రకటించిన ప్రకటన జ్ఞప్తికివస్తోంది. రుమేనియాను కబళించడానికిగాక, ఫాసిస్టుల చెరనుండి రుమేనియన్ ప్రజలను విడిపించడానికి సోవియట్ సైన్యాలు వస్తున్నాయని అపుడు మాలటోవ్ ప్రకటించాడు.

ఈనాడు అది స్పష్టమైంది ఒక్క రుమేనియాకేగాక, తక్కిన బాల్కన్ బాల్టిక్ దేశాలన్నిటినీ నాజీచెరనుండి విముక్తి చేస్తోంది సోవియట్. నూతన ప్రజాస్వామిక యూరప్‌కు రూపురేఖలు దిద్దుతోంది సోవియట్.

— తుమ్మల వెంకటరామయ్య, 19—9—44.

రావు కమిటీ బిల్లులో చేయవలసిన మార్పులు

మానికొండ సూర్యావతి

నేను అనుకుంటున్న 'హిందూలా'లో చాల లోపాలున్నాయనీ, వివాహ వారసత్వము లలో స్త్రీలకేమీ హక్కులులేక బానిసలుగా చేయబడ్డారనీ, అందరూ అంగీకరించుతారు. స్త్రీలకు న్యాయం కలుగజేయడానికి, ప్రజా ప్రతినిధులైన జి. వి. దేశముఖు, రాధాబాయి సుబ్బరాయన్, అఖిలచంద్రదత్తుగార్లు కేంద్ర శాసనసభలో మూడుబిల్లులను ప్రవేశపెట్టారు. మొదటిది హిందూ వితంతువులకు భర్త ఆస్తిపై సంపూర్ణమైన హక్కు వుండాలనీ; రెండవది పురుషుడు ఎక్కువమంది భార్యలను పెండ్లిచేసుకోకుండా నిషేధించాలనీ; మూడవది హిందూస్త్రీలకు విడాకులహక్కు ఇవ్వాలనీ.

వీటినిగూర్చి ఆలోచించడానికి 1941 జనవరిలో బి. యన్. రావు కమిటీని ప్రభుత్వం నియమించింది. హిందూ లా అంతా లోపభూయిష్టంగా ఉందిగాన చిన్నచిన్న సవరణలవల్ల ప్రయోజనంలేదనీ, అంతా 'కోడిఫై' చేయాలనీ, తన నివేదికలో వ్రాసింది. అంతట రావు కమిటీ ప్రభుత్వ అనుమతిపై హిందూ లా లోని వివాహాలు, వారసత్వం అనే భాగాలను 'కోడిఫై' చేసింది. 1942 మేలో అవి బిల్లులుగా ప్రకటించబడినవి. కేంద్రఅసెంబ్లీ, కౌన్సిలు రెంటియొక్క జాయింటు కమిటీకి ఇవి సవరణకోసం పంపబడినవి. ఆ జాయింటుకమిటీ బిల్లును వడపోసి, రెండు కేంద్రశాసనసభలకు అందించింది. జాయింటుకమిటీ సంస్కరించిన బిల్లులలో బి. యన్. రావు కమిటీ మరల కొన్ని మార్పులుచేసి, హిందూలాలోని మిగతా భాగాలనుగూడ 'కోడిఫై'చేసి, హిందూలా మొత్తం చిత్తు చట్టాన్ని ఈ సంవత్సరం జూలైలో ప్రకటించింది.

రావుకమిటీ ప్రజాభిప్రాయం తెలుసుకోడానికి భారతదేశంలోని ముఖ్య పట్టణాలు తిరుగుతుందనీ, తమఅభిప్రాయాన్ని ముఖతా తెలుపదలచినవారు 1944 అక్టోబరు 5వ తేదీలోగా ఆ కమిటీ కార్యదర్శికి తెలియ చేయాలనీ, వ్రాతమూలంగా తమ అభిప్రాయాలను తెలిపేవారు పై తేదీలోగానే తమ మెమోరాండములను పంపాలనీ, ప్రభుత్వం ప్రకటించింది. హిందూమహాసభనాయకులు, ఇతర సనాతనుల వత్తిడికి, ప్రభుత్వం లొంగి, సుమారు ఐదుసంవత్సరాలనుండీ కాలయాపన చేస్తూ వచ్చింది. ఇన్నిసార్లు వడపోసి చివరకు తేర్చిన ఈ చిత్తుచట్టాన్ని సైతం హిందూ మహాసభనాయకులు..సనాతనులువ్యతిరేకించు తున్నారు. హిందూ కుటుంబం ముక్క చెక్కలైపోతుందనీ, హిందూమతానికి తీరని హాని వాటిల్లుతుందని గోలపెడుతున్నారు. ఇది ఎంతవరకు నిజమో చూదాం.

వారసత్వం, మనోవర్తి

మొదట వారసత్వం-మనోవర్తి అనేభాగంలోని ముఖ్య విషయాలను మాత్రమే చూదాం.

(1) 1935 ఫెడరలుచట్టం ప్రకారం కేంద్రశాసనసభకు వ్యవసాయ భూములను గూర్చి శాసనాలుచేసే హక్కులేదు. రాష్ట్ర శాసనసభలే వ్యవసాయ భూములనుగూర్చి ఏశాసనాలైనా చేయవచ్చును. అందుచే పై చిత్తుశాసనం చరాస్తికి (డబ్బు పశువులు కదులుటకు వీలైన వస్తువులు) వ్యవసాయ భూములు కాని స్థిరాస్తికి (ఇల్లు చిన్నిదొడ్లు వగైరా) మాత్రమే వర్తిస్తుంది రాష్ట్రప్రభుత్వాలు ఈ చిత్తు శాసనం వ్యవసాయ భూములకుగూడ త్వరగా వర్తింపచేస్తాయని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. అలా చేయించే బాధ్యత ప్రజలమీదవుంది

(2) ఆస్తిమీద జన్మతః ఉన్న హక్కు పోయింది. దక్షిణ భారత దేశంలో ఇంతవరకు పిత్రార్జితమైన ఆస్తిమీద పుట్టుకతోనే హక్కుఉంది. అంటే తండ్రియొక్క ఆస్తిని కుమారులు తండ్రి బ్రతికి ఉండగానే పంచుకునే హక్కుంది. కుమారులు ఉండగ తండ్రి తన ఆస్తిని ఇష్టంవచ్చినట్లు చేయడానికి వీలులేదు. పై చిత్తు చట్టంలో ఈ విధానం పూర్తిగారద్దుచేయబడినది తండ్రిబెంగాలులో వలె ఆస్తికి సర్వాధికారి చేయబడినాడు. అతడు తన ఆస్తిని ఇష్టంవచ్చిన వారికి ఇచ్చివేయ వచ్చును. కుమారులు గాని కూతుళ్లుగాని నోరు మెదపడానికి వీలులేదు తండ్రిని ఆస్తికంతకూ సర్వాధికారునిగాజేసే ఈపద్ధతి చాల హానికరమైనది. దీనిని ప్రజాశ్రేయస్సుగోరేవారందరూ ప్రతిఘటించాలిసిందే.

తండ్రిని ఆస్తికి సర్వాధికారునిగా చేయడం వల్ల, సామాన్యంగా మనుమలు, మునిమనుమలు పుట్టేటంతవరకూ గూడ కుటుంబాన్ని జాయంటుగా పెట్టే అవకాశం ఎక్కువచేయబడుతోంది. కుటుంబంలోని వారందరూ కుటుంబ యజమాని నిరంకుశత్వానికి తల వంచి ఉండాలసివస్తుంది. నేడు సమిష్టి కుటుంబాల స్థితి ఎలా ఉందో చూడండి: తండ్రి వయస్సువచ్చిన కుమారులందరిమీద. తల్లి కోడండ్రమీద పెత్తనంచలాయించడం. తండ్రి తను చెప్పినట్లు వినని కుమారుని భాగం పంచుకొమ్మని బెదరించడం. తల్లి కోడండ్రను సరిగా చూడకుండా, ఇల్లుదోచికూతుళ్ళకు చాటుగా చేరవేయడం. నిత్యజీవిత విషయాలు. చివరకు పెండ్లిండ్లు చేసుకొనే విషయంలో సైతం కుటుంబంలోని ఇతరులకు స్వేచ్ఛఉండదు. సమిష్టి కుటుంబంలోని స్వేచ్ఛవ్యక్తిత్వానికి, అభివృద్ధికి తావుండదు. అందుచే ప్రతి సమిష్టి కుటుంబంలోనూ తండ్రి కుమారులమధ్య, అత్త కోడండ్ర మధ్య; కోడండ్రలోను; అన్నదమ్ములలో ఒకరొకరి మధ్య; అనేక కలహాలు ఉంటాయి. దీనివల్ల సమిష్టి ఆస్తిని సరిగా కాపాడకపోవడం. ఇల్లు వాకిళ్లు పాడుబెట్టుకోవడం మనం నిత్యం చూస్తూనేఉన్నాం. సమిష్టి కుటుంబంలో నిరంతరం అంతర్యుద్ధం జరుగుతూఉంటుంది.

విద్య, విజ్ఞానం, నాగరికత ప్రబలిన డెల్టా ప్రాంతానలో ప్రతివ్యక్తికి స్వాతంత్ర్యభావాలు వ్యక్తిత్వం కలుగుతూ ఉన్నవి. ఆప్రాంతాలలో సమిష్టికుటుంబాలు త్వరగా విడిపోతున్నాయి. ఇందువల్ల స్వేచ్ఛగా జీవితం గడపడానికి, సంపాదనలో నూతన అభివృద్ధి పద్ధతులు అవలంబించడానికి, ఎంతోఅవకాశం గలుగుతూఉంది. అన్నదమ్ములు స్నేహముగా ఉండటానికి ఎంతో వీలుంది. విద్య, నాగరికత ఎంతో అభివృద్ధి అవుతోంది. స్వాతంత్ర్యోద్యమం, ఇతర అభివృద్ధి ఉద్యమాలు ఇందువల్ల ఎంతో అభివృద్ధి అవుతూ ఉన్నవి. రావుకమిటీ చిత్తుశాసనంవల్ల తండ్రిని ఆస్తిమీద సర్వాధికారునిగా చేయడం వల్ల, సమిష్టి కుటుంబవిధానం ఇంకా బలపడుతుంది. విద్య, విజ్ఞానం, నాగరికత, ఒక్కమాటలో చెప్పాలంటే దేశాభివృద్ధికి దెబ్బ తగులుతుంది.

(3) తండ్రి విల్లువ్రాయకుండా చనిపోతే ఆతనిఆస్తి ఈ క్రిందివిధంగా వారసులకు సంక్రమించుతుంది.

(క) భార్యకు లేక భార్యలందరికీ ఒక భాగం, ఒక్కొక్క కుమారునికి ఒక్కొక్క భాగం, ఒక్కొక్క కుమార్తెకు ఒక్కొక్క అరభాగం, తండ్రి ఆస్తినుండి వస్తుంది. ఈ ఆస్తిమీద వీరికి పూర్తిహక్కు ఉంటుంది.

ఇప్పటి హిందూ లా ప్రకారం తండ్రి ఆస్తిలో భాగం తీసుకునేహక్కు కుమార్తెకు, భార్యకు లేదు. వీరిద్దరికి భాగం పంచుకునే హక్కు ఇవ్వడంలో రావుకమిటీ అభివృద్ధి పంథానే త్రొక్కింది. కాని కుమార్తెకు కుమారునితోపాటు సమానభాగ మివ్వలేదు. ఒకేగర్భానపుట్టి వారిలో ఇటువంటిభేదం చూపడం ధర్మసమ్మతంగాదు. కుమార్తెకు కుమారునితోపాటు సమానభాగం ఉండటం న్యాయం.

కుమార్తె తనవాటాను అమ్ముకొనేటట్లయితే, ఆమె అప్పటిధరల ప్రకారం తన అన్నదమ్ములకే అమ్మాలనిగూడ ఆచిత్తు చట్టంలోఉంది.

(ఖ) ఒకవ్యక్తి సంతానంలేకుండా చనిపోతే అతనిభార్యకు ఆ ఆస్తిమీద పూర్తి హక్కు లభిస్తుంది.

(గ) ఒకవ్యక్తి భార్య బిడ్డలు మనుమలు లేకుండా చనిపోతే, అతని తల్లి తండ్రి అన్నదమ్ములు, తరువాత అన్నదమ్ముల కుమాళ్లు, తరువాత మనుమరాండ్రు-వరుసగా వారసులౌతూ ఉంటారు.

(ఘ) ఒక వ్యక్తియొక్క అక్క చెల్లెండ్రకు అన్నదమ్ములతోపాటు వారసత్వం ఇవ్వబడలేదు. అక్కచెల్లెండ్రు చాలమంది వారసుల తర్వాత ఎక్కడో చివరకు త్రోసి వేయబడ్డారు. ఇది అన్యాయం. అన్నదమ్ములతోపాటు అక్కచెల్లెండ్రకుగూడ వారసత్వం గలుగజెయ్యాలి.

(చ) అలాగే మేనత్తకు ఒక వ్యక్తి యొక్క పినతండ్రులు పెదతండ్రులతోపాటు సమాన వారసత్వంలేదు.

పై వారసత్వవిధానాన్ని పరికించితే, స్త్రీలు పురుషులకన్న తక్కువస్థానంలో ఉంచబడ్డారని స్పష్టమవుతుంది. ఇది ధర్మసమ్మతం గాదు. ఈ విధమైనభేదం చూపుట దేశానికే హానికరం. పై వారసత్వ విధానాన్ని రద్దు చేసి, సమీప బంధుత్వ సూత్రాన్ననుసరించి వారసత్వం నిర్ణయించేపద్ధతిని ప్రవేశపెట్టాలి. అనగా ఒకే గర్భమున పుట్టినవారందరూ, పురుషులైనాసరే స్త్రీలైనాసరే, ఒక ఆస్తికి సమాన భాగస్వాములుగాను, ఏకకాల వారసులు (Simultaneous heirs) గాను ఉండాలి.

(4) ఒకవ్యక్తి చనిపోతే, అతని వితంతువైన కోడలుకు ఆస్తిలో భాగం పంచుకునే హక్కులేదు. సమిష్టి కుటుంబమునుండి భర్త భాగాన్ని పంచుకొని అనుభవించే హక్కు దేశముఖు ఆక్టువల్ల స్త్రీలకు లభించింది పైదానివల్ల ఈహక్కుఎగిరిపోయింది దీనికి బదులుగా వితంతువైన కోడలుకు మనోవర్తి ఇవ్వబడాలని సూచించబడింది. (రెండు శాసనసభల జాయింటుకమిటీ వితంతువైన కోడలును, తలిదండ్రులను, భార్య కుమారులు కుమార్తెలతోపాటు ఏకకాల వారసులనుగా చేర్చింది. కాని రావుకమిటీ దీన్ని రద్దు చేసింది.) ఎంతో ఆందోళనద్వారా స్త్రీలు దేశముఖు ఆక్టుద్వారా సంపాదించుకున్న పై హక్కును, తీసివేయడం అన్యాయం. సమిష్టి కుటుంబంనుండి వితంతువు తన భర్తఆస్తిని పంచుకొని అనుభవించే హక్కును తిరిగి పునరుద్ధరించాలి.

వితంతువు కారణంలేకుండా సమిష్టికుటుంబానికి సంబంధించిన ఇంట్లోనివసించక, వేరే చోట నివసించితే, అంతకాలం మనోవర్తి ఇవ్వబడదట! సామాన్యంగా వితంతువులు తమ అన్నదమ్ములు అక్కచెల్లెండ్ర ఇంట వుంటారు. ఈ సౌకర్యాన్ని తొలగించడంలో రావుకమిటీ ఉద్దేశ్యమేమిటో బోధపడుట లేదు.

(5) స్త్రీధనంలో తండ్రి భర్త మొదలైనవారి ద్వారాగాని, మరేవిధంగాగాని స్త్రీకి లభించిన ఆస్తిఅంతా చేర్చబడింది. దీనిమీద స్త్రీకి దానదమనవిక్రయాది సర్వహక్కులు ఉన్నవి.

ఒక స్త్రీ విల్లు వ్రాయకుండా చనిపోతే, ఆమెకు భర్తద్వారా సంక్రమించిన ఆస్తి, భర్త ఆస్తివలెనే వారసులకు పంపిణీ చేయబడుతుంది. భర్తద్వారా సంక్రమించిన ఆస్తి పోగా మిగిలిన ఆస్తి, ఒక్కొక్క కుమార్తెకు ఒక్కొక్కభాగం ఒక్కొక్క కుమారునికి ఒక్కొక్క అరభాగం చొప్పున చెందుతాయి. కుమార్తెలు కుమారులు తర్వాత మనుమలు మనుమరాండ్రకు. వారి తర్వాత భర్తకు. ఆ తర్వాత తల్లికి, ఆ తర్వాత తండ్రికి చెందుతుంది.

స్త్రీ ధనం పంపిణీ విషయంలోఉన్న పై తికమకలు స్త్రీ పురుషులకు సమాన వారసత్వ హక్కుఇస్తే అంతరిస్తాయి. పురుషునికి వలెనే, ఒక స్త్రీ చనిపోతే ఆమెభర్తకు కుమార్తెలు కుమారులు ఏకకాల వారసులుగాను, సమాన భాగస్వాములుగాను చేయాలి.

(6) హిందువులలో అంతర్వర్ణ వివాహాలకుగూడ ఈ వారసత్వచట్టం వర్తించుతుంది. అంటే అంతర్వర్ణ వివాహాలకు పెద్ద అభ్యంతరం తొలగిపోయిందన్నమాట. ఇది చాల అభివృద్ధికరమైన మార్పు.

(7) భర్త తనభార్య వ్యభిచారి అని కోర్టులో దావావేసి గెలిస్తే, అప్పుడు ఆమెకు చనిపోయిన భర్త ఆస్తిలో భాగం పంచుకునే హక్కులేదని ఎవరైనా పేచీపెడితే, ఆమెకు భర్తఆస్తిలో పంచుకునే హక్కుపోతుంది. ప్రస్తుత సమాజంలో స్త్రీలు అస్వతంత్రులుగా ఉన్నారు. అమాయకులైన భార్యలను వారి విధికివదలివేసి, దుర్వ్యసనాలలో మునిగిపోయిన పురుషులను అనేకమందిని చూస్తున్నాము. పైరూలు ఇటువంటివారికి భార్యలను గంగపాలుచేయడానికి ఉపయోగిస్తుంది. తన కిష్టంలేకపోతే, తనభార్యవ్యభిచారి అనితప్పుడు సాక్ష్యంకల్పించి దావావేసి, ఆస్తిని చెందకుండా చేయవచ్చును. కనుక ఈరూలును తొలగించాలి అంటే వ్యభిచారాన్ని ప్రోత్సహించడం నా అభిప్రాయంగాదు. స్త్రీలకు అన్యాయం జరుగకూడదనిమాత్రమే నా అభిప్రాయం. వ్యభిచారాన్ని ఇతర విధాలద్వారా పోగొట్టాలి.

(వివాహం అనే భాగాన్నిగూర్చి ముందు సంచికలో వ్రాస్తాను.)

Printed and Published by Katragadda Rajagopala Rao at Prajasakti Press, Governorpet - Bezwada.

END OF ISSUE